www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 146 | ఆదివారం 12.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

విలేకరులు కావలెను

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

## అభివృద్ధిలో భారత్ సరికొత్త రికార్డులు

- వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ భారత్: మోదీ
- ప్రపంచానికి అభివృద్ధి నమూనాగా భారత్: మోదీ
- వ్యాక్సిన్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో నెంబర్ వన్
- మొబైల్ తయారీలో ప్రపంచంలో రెండో స్థానంలో భారత్
- డిజిటల్ మౌలిక వసతుల్లో భారత్‌కు ప్రపంచ గుర్తింపు

05



ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. న్యూజీలాండ్ పర్యటనలో భాగంగా ఆక్లాండ్‌లో శనివారం నిర్వహించిన భారతీయ సమాజ ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ వివిధ రంగాలలో భారత్ సాధిస్తున్న అంతర్జాతీయ మైలురాళ్లను ప్రపంచ వేదికపై గర్వంగా చాటారు. ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ల ఉత్పత్తిదారుగా, పాల ఉత్పత్తిలో భారత్ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ప్రధాని వెల్లడించారు. అలాగే అంతర్జాతీయంగా మొబైల్ తయారీలో, టెలికాం మార్కెట్‌లో, గోధుమలు, చేపల ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ...

## వికసిత్ భారత్-2047 లక్ష్యం

### హైదరాబాద్‌కు 3 బుల్లెట్ ట్రైన్ కారిడార్లు.!

- వికసిత్ భారత్‌కు సాంకేతికతే కీలక శక్తి
- సెమీకండక్టర్ రంగంలో భారత్‌కు భారీ అవకాశాలు
- 315 యూనివర్సిటీలకు ఉచిత చిప్ డిజైన్ టూల్స్
- ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ రూ.20 లక్షల కోట్ల దిశగా
- హైదరాబాద్‌కు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు
- 2027లో తొలి బుల్లెట్ ట్రైన్ సేవలు ప్రారంభం

05



'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఇండస్ట్రీ లీడర్ టౌన్ హాల్' సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, బుల్లెట్ ట్రైన్, రైల్వే ఆధునికీకరణ వంటి రంగాల్లో జరుగుతున్న మార్పులను వివరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమలో దాదాపు 10 లక్షల మంది నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరత ఉందని అశ్విని వైష్ణవ్ తెలిపారు.

# కిలాడీ కమిటీలో రాజేందర్

## పారుతున్న నీళ్లను ఎత్తిపోస్తే బ్యారేజీలు ఎందుకు?

### కాళేశ్వరంపై హరీశ్‌రావు సూచనల మేరకే ఈటల రాజేందర్ మాట్లాడారు..

- కాళేశ్వరం విషయంలో ఈటల అసత్యాలు మాట్లాడుతున్నారు
- బీఆర్ఎస్ నేతలా ఈటల మాట్లాడటం విచారకరం
- మేడిగడ్డ లోపాలు బీఆర్ఎస్ హయాంలోనే బయటపడ్డాయి
- ఎన్డీఎస్ఏ నివేదికను ఈటల ఎందుకు విస్మరిస్తున్నారు?
- కాళేశ్వరం లోపాలకు బీఆర్ఎస్ నిర్లక్ష్యమే కారణం
- కన్నెపల్లి పంప్‌హౌస్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు
- బ్యారేజీలు లేకుండా ఎత్తిపోతలు ఎలా సాధ్యం
- హరీశ్ సూచనలతోనే ఈటల మాట్లాడుతున్నారు
- కాళేశ్వరంపై బీజేపీ ఎంపీకి సీఎం ఘాటు కౌంటర్
- మేడిగడ్డలో నీటి నిల్వ సాధ్యం కాదన్న ఎన్డీఎస్ఏ

03

**కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు.. గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చింది..**



**బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈటల రాజేందర్ అంటే తమకు ఎంతో గౌరవం ఉందని, కానీ కాళేశ్వరం విషయంలో ఆయన అసత్యాలు మాట్లాడి ఆ గౌరవాన్ని కోల్పోతున్నారని సీఎం పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఇచ్చిన సూచనలతోనే ఈటల రాజేందర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుకూలంగా కామెంట్స్ చేశారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఒక బీజేపీ ఎంపీలా కాకుండా, బీఆర్ఎస్ నేతలా ఈటల మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.**

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మేడిగడ్డ బ్యారేజ్లో తీవ్రమైన లోపాలు ఉన్నాయని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తేలిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రాజెక్టు ప్రారంభించిన కేవలం 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని, ఆ సమయంలోనే వాటిని సవరించాలని ఇంజినీర్లు మొత్తుకున్నా.. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. మొదట్లోనే ఆ లోపాలను సరిదిద్ది ఉంటే సమస్య ఇంత పెద్దది అయ్యేది కాదని. నాటి పాలకుల నిర్లక్ష్యం వల్లే నేడు మేడిగడ్డ బ్యారేజ్ కుప్పకూలే పరిస్థితి ఏర్పడిందని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

# మార్చి 2027 నాటికి భూ రీ-సర్వే పూర్తి..



### గుడిసెల్లో నివసించే కుటుంబాలే ప్రాధాన్యతగా రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు

**సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి**

**రైతుల భూములకు పూర్తి భద్రతే ప్రభుత్వ లక్ష్యం**

**ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ-సర్వే ప్రారంభం**

- భూ రీ-సర్వేకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- భూ భారతి అమలుకు రీ-సర్వే తప్పనిసరి
- మార్చి 2027 నాటికి భూ రీ-సర్వే పూర్తి లక్ష్యం
- ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ-సర్వే ప్రారంభం
- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం
- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలి
- లైసెన్స్ సర్వేయర్లతో భూ రీ-సర్వే వేగవంతం
- జూలై 28లోపు చేరని సర్వేయర్ల లైసెన్సులు రద్దు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి
- పనులు చేయని అధికారులపై సస్పెన్షన్ తప్పదు
- భూ భారతి అమలుపై కలెక్టర్లకు మంత్రి కీలక ఆదేశాలు

02

# కాంగ్రెస్‌కు 7 సీట్లు కూడా రావు.!

## మేడిగడ్డతో పని లేకుండానే నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు..

### రేవంత్ రెడ్డికి శీల పరీక్ష చేయాలి..

- కాళేశ్వరం నీళ్లు ఎత్తకపోవడం ప్రభుత్వ వైఫల్యం
- రాజకీయ కక్షతో రైతులను నష్టపరుస్తున్నారు
- కన్నెపల్లి నుంచే నీటి ఎత్తిపోతలు సాధ్యం
- రిటైర్డ్ ఇంజనీర్ల నివేదికను పట్టించుకోండి
- 200 టీఎంసీల నీరు ఎత్తిపోసే అవకాశం
- గోదావరి వరద నీటిని వృథా చేస్తున్నారు
- తెలంగాణ సాగునీటిపై కేటీఆర్ ఆందోళన
- రేవంత్ వైఖరితో రైతులు తీవ్ర ఇబ్బందులు
- కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడాలని కేటీఆర్ డిమాండ్

03



# పోక్సో కేసు పెట్టారన్న కక్షతో

## 20 నిమిషాల్లోనే ఆరుగురిని చంపేసిన రాజ్ కుమార్



### బాలిక, ఆమె తల్లి, నానమ్మతో పాటు భార్య, ఇద్దరు పసిపిల్లల గొంతుకోసి హత్య

- పోక్సో కేసు కక్షతో ఆరుగురి దారుణ హత్యలు
- 20 నిమిషాల్లో ఆరుగురిని హత్య చేసిన నిందితుడు
- ప్రియురాలు, కుటుంబాన్ని చంపి పరారైన రాజ్‌కుమార్
- షాబాద్‌లో ఆరుగురి హత్యలతో కలకలం
- భార్య, ఇద్దరు చిన్నారులను కూడా హత్య చేశాడు
- పోక్సో కేసు తర్వాత ప్రతీకారంతో మారణహోమం
- ఆరుగురి హత్యల కేసులో సంచలన వివరాలు
- ఏడు ప్రత్యేక బృందాలతో నిందితుడి కోసం గాలింపు
- తల్లిదండ్రులకు ఫోన్ చేసి హత్యలు ఒప్పుకున్న నిందితుడు
- షాబాద్ హత్యలపై పోలీసుల కీలక వివరాలు

02

**ఆరుగురిని కిరాతకంగా చంపి..**

రాజ్ కుమార్ అనే వ్యక్తి ఆరు నెలలుగా బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో అతనిపై పోక్సో కేసు నమోదైంది. దీన్ని మనసులో పెట్టుకున్న రాజకుమార్ నిన్న రాత్రి 11 గంటల సమయంలో బాలిక ఇంటికి వెళ్లి ఆమె తల్లి చిట్యాల లక్ష్మి (45), నాయనమ్మ చిట్యాల రుక్కమ్మ (65)లను కత్తితో హత్య చేశాడు. అనంతరం బాలిక (17)ను కారులో దైవాలగూడ చెరువు కట్ట వద్దకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడి ఆమెనూ గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అంతటితో ఆగకుండా తన ఇంటికి వెళ్లిన నిందితుడు భార్య పార్వతి సరిత (30)ను ఈడ్చుకెళ్లి గొంతు కోసి చంపేశాడు. నిద్రిస్తున్న తన ఇద్దరు పిల్లలు పరిక్షిత్ (3), దైవిక్షిత్ (2)లను అత్యంత దారుణంగా హత్య చేశాడు. అనంతరం తన తండ్రికి ఫోన్ చేసి 'ఆరుగురిని చంపేశాను' అని చెప్పి పరారయ్యాడు.





# జగ్గారెడ్డి సెన్సేషనల్ కామెంట్స్

## సంగారెడ్డిలో పోటీ చేయనన్నా..

- సంగారెడ్డి నుంచి పోటీ చేయను, పార్టీ చెప్పినచోటే పోటీ
- టికెట్ నిర్ణయం పూర్తిగా కాంగ్రెస్ అధిష్ఠానానిదే
- 117 స్థానాల లక్ష్యం సరైన వ్యూహం
- ఎమ్మెల్యేల పనితీరు సమీక్షించడం సీఎం హక్కే
- పనితీరు బాగోలేకపోతే టికెట్ కష్టమే
- బీఆర్ఎస్, బీజేపీ సర్వేలు రాజకీయ ప్రచారమే

03

# వియత్నాంలో ఘోర విషాదం..

### మృతులకు ప్రధాని మోడీ సంతాపం
### సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి



- ఫూ కుయోక్ సమీపంలో పర్యాటక బోటు బోల్తా
- బోటు ప్రమాదంలో ఏపీ, తెలంగాణ టూరిస్టులు మృతి
- వియత్నాం బోటు ప్రమాదంలో పలువురు భారతీయులు గల్లంతు
- ప్రమాద బాధితుల కోసం సహాయక చర్యలు ముమ్మరం
- భారత రాయబార కార్యాలయం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- విహారయాత్ర విషాదం.. భారతీయ పర్యాటకులపై విషాదం

02

వియత్నాంలోని ఫు క్వాక్ ఐలాండ్ సమీపంలో భారతీయ పర్యాటకులతో వెళ్తున్న ఒక పర్యాటక బోటు ప్రమాదవశాత్తూ మునిగిపోయింది. ఈ ప్రమాదంలో తెలంగాణకు చెందిన పర్యాటకులు కూడా ఉన్నట్లు సమాచారం అందడంతో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ప్రమాదానికి గురైన బాధితుల కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారాన్ని అందించడానికి, అలాగే సహాయక చర్యలను వేగంగా సమన్వయం చేయడానికి తెలంగాణ ప్రభుత్వ ...

# పోక్సో కేసు పెట్టారన్న కక్షతో

## 20 నిమిషాల్లోనే ఆరుగురిని చంపేసిన రాజ్ కుమార్..


**షాబాద్,ఫ్లాష్ ఇండియా :** రంగారెడ్డి జిల్లా షాబాద్ ప్రాంతం ఆరుగురి హత్యలతో ఉలిక్కిపడింది. ప్రశాంతపు ఉదయం వేళ హత్యల సమాచారం అందరినీ భయాందోళనకు గురిచేసింది. తనపై పోక్సో కేసు పెట్టారన్న కోపంతో రగిలిపోయిన నిందితుడు రాజ్ కుమార్ ప్రియురాలు మైనర్ బాలికను, ఆమెతోపాటు తల్లిని, నానమ్మను హత్య చేశాడు. ఆ తర్వాత భార్యా బిడ్డల్ని అంతమొందించి కారులో పరారయ్యాడు. ఈ మారణ హోమం కేవలం 20 నిమిషాల్లోనే సాగిందని పోలీసులు వెల్లడించారు. షాబాద్ ఆరుగురి హత్య కేసులో కొనసాగుతున్న విచారణలో సంచలన విషయాలు వెలుగుచూస్తున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాత్రి 11 గంటల పది నిమిషాల నుంచి 11 గంటల 57 నిమిషాల మధ్యలో హత్యాకాండ కొనసాగినట్లు తెలిపారు. 11 గంటల పది నిమిషాలకి మైనర్ బాలిక ఇంటికి రాజకుమార్ చేరుకున్నాడు. 11. 12 నిమిషాలకి మైనర్ బాలిక ఇంటి తలుపు తట్టాడు. 11.13 రాజ్ కుమార్ తలుపు తట్టడంతో డోర్ ఓపెన్ చేసిన మైనర్ బాలిక తల్లి. డోర్ ఓపెన్ చేయగానే ఆమె కడుపులో కత్తితో పొడిచాడు. మైనర్ బాలిక తల్లి కింద పడగానే ఇంటి లోపలికి వెళ్ళాడు రాజకుమార్.. ఇంటి లోపల ఉన్న నాయనమ్మ రుక్కమ్మను గొంతు కోసి చంపాడు. రుక్కమ్మ చనిపోయిన తర్వాత బాలిక తల్లి లక్ష్మిని పొడిచి చంపిన రాజకుమార్.. ఇద్దరిని చంపేసిన తర్వాత మైనర్ బాలికను బలవంతంగా కారులో ఎక్కించుకొని తీసుకువెళ్లాడు. నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవాదుల చెరువు వద్దకు బాలికను తీసుకువెళ్లాడు. చెరువు వద్ద బాలిక గొంతు కోసి చంపేశాడు. బాలికను చంపేసి నేరుగా తన ఇంటికి వెళ్లాడు రాజకుమార్.. మధ్యాహ్నం సమయంలోనే ఇంటికి వస్తున్నట్లుగా భార్యతో చెప్పాడు. భర్త రాజ్ కుమార్ వచ్చిన సమయంలో బాలుడికి పాలు పట్టిస్తున్న భార్య.. భార్యపై ఒక్కసారిగా కత్తితో దాడి చేసి చంపేందుకు ప్రయత్నం చేశాడు. వెంటనే అప్రమత్తమైన భార్య భర్త నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసింది. అయినా విడవకుండా భార్య కడుపుతో పాటు గొంతు కోసి చంపేశాడు. భార్య చనిపోయిన తర్వాత ఇద్దరు పిల్లల గొంతు కోసి చంపేశాడు. ఇంట్లో నుంచి బయటికి వచ్చి తండ్రికి కాల్ చేశాడు రాజ్ కుమార్. ఆరుగురిని చంపేశాను తాను చనిపోతాను అంటూ తండ్రికి ఫోన్ లో చెప్పాడు. 11. 57 నిమిషాలకు తండ్రికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. 11 గంటల 57 నిమిషాలకు రాజ్ కుమార్ కారులో పారిపోయాడు. రాజ్ కుమార్ పెద్ద ఎత్తున ఆన్లైన్ బెట్టింగ్ లో డబ్బులు పెట్టినట్లు పోలీసుల గుర్తించారు. దాదాపు రెండు కోట్ల రూపాయలు డబ్బులు పెట్టి నష్టపోయినట్లు గుర్తించారు. గతంలో కూడా నిందితుడు ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లు తెలిపారు.

**ఈ ఘటనపై ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ..**

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల ఘటనపై ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి కీలక వివరాలు వెల్లడించారు. రాత్రి జరిగిన ఈ ఘటనపై మాట్లాడిన ఆయన, దర్యాప్తులో ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన అంశాలను వివరించారు. సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ, రాత్రి హత్య జరిగినట్లు తమకు సమాచారం వచ్చిందని, ఈ ఘటన రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగినట్లు తెలిపారు. మొదట నిందితుడు రాత్రి 11 గంటల సమయంలో షాబాద్‌లోని బాధితురాలి ఇంటికి వెళ్లాడని, అక్కడ బాధితురాలి తల్లి, నానమ్మను కత్తితో హత్య చేశాడని చెప్పారు. మే 16న నిందితుడిపై పోక్సో కేసు నమోదు అయిందని, ఆ కేసులో అతనికి బెయిల్ లభించిందని సీపీ వెల్లడించారు. నిందితుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, బాధితురాలికి తల్లి, నానమ్మ ఉన్నారని తెలిపారు. బాధితురాలి తల్లి, నానమ్మను హత్య చేసిన అనంతరం, బాలికను నగర్‌కుంట సమీపంలోని చెరువు వద్దకు తీసుకెళ్లి హత్య చేశాడని వివరించారు. ఆ తర్వాత నిందితుడు తన ఇంటికి వెళ్లి భార్య, ఇద్దరు పిల్లలను హత్య చేశాడని సీపీ తెలిపారు. హత్యల అనంతరం రాజ్ కుమార్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి "నేను ఆరుగురిని చంపాను… నేను కూడా చనిపోతున్నాను" అని చెప్పాడని వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం నిందితుడు రాజ్ కుమార్ పరారీలో ఉన్నాడని, అతని కోసం ఏడు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని సీపీ వెల్లడించారు. భార్య, ఇద్దరు చిన్నారులను కూడా హత్య చేయడం తమను సైతం ఆశ్చర్యానికి గురి చేసిందని ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి పేర్కొన్నారు.

**షాబాద్ ఎస్సై రమేష్ సస్పెన్షన్**

ఆరు హత్యల కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. షాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమేష్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ చర్యతో బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు చేపట్టిన ఆందోళనను విరమించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసులు గాలింపును ముమ్మరం చేశారు. అతడు ప్రయాణించిన కారును నందిగామ సమీపంలో పోలీసులు గుర్తించారు. కారు స్వాధీనం చేసుకుని, దాని ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రాథమిక విచారణలో నిందితుడు కారు వదిలి నందిగామ రైల్వే స్టేషన్ వైపు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలతో పాటు సీసీటీవీ ఫుటేజీను పరిశీలిస్తూ ప్రత్యేక బృందాలు అతడి కోసం విస్తృతంగా గాలిస్తున్నాయి. కాగా, తనపై పోక్సో కేసు నమోదైందన్న ఆగ్రహంతో రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని అత్యంత దారుణంగా హత్య చేశాడు. పోక్సో కేసు పెట్టిన బాలికను బలవంతంగా దైవాలగూడ చెరువు వద్దకు తీసుకెళ్లి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం తన భార్య, చిన్నారిని కూడా హత్య చేశాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈ దారుణం జరిగిందని ఆరోపిస్తూ నిరసన చేపట్టారు. పోక్సో కేసును మొదటి నుంచే సక్రమంగా దర్యాప్తు చేసి, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఈ ప్రాణనష్టం జరిగేది కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేసు విచారణలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు షాబాద్ ఎస్ఐ రమేష్‌ను సస్పెండ్ చేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు తమ నిరసనను విరమించారు.



# అభివృద్ధిలో భారత్ సరికొత్త రికార్డులు

**న్యూ ఢిల్లీ :** ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. న్యూజీలాండ్ పర్యటనలో భాగంగా ఆక్లాండ్‌లో శనివారం నిర్వహించిన భారతీయ సమాజ ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ వివిధ రంగాలలో భారత్ సాధిస్తున్న అంతర్జాతీయ మైలురాళ్లను ప్రపంచ వేదికపై గర్వంగా చాటారు. ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ల ఉత్పత్తిదారుగా, పాల ఉత్పత్తిలో భారత్ నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ప్రధాని వెల్లడించారు. అలాగే అంతర్జాతీయంగా మొబైల్ తయారీలో, టెలికాం మార్కెట్‌లో, గోధుమలు, చేపల ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా అవతరించిందని, మొబైల్ డేటా వినియోగంలో అగ్రగామిగా దూసుకుపోతోందని కొనియాడారు. నేడు భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా, అత్యంత వేగంగా విస్తరిస్తున్న మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా ఎదిగిందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. త్వరలోనే పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలోనూ భారత్ ప్రపంచంలోనే మూడో స్థానానికి చేరుకోబోతోందని, సోలార్ ఎనర్జీ కెపాసిటీలోనూ అగ్రగామి దేశాల సరసన నిలిచిందని వెల్లడించారు. నేటి భారతదేశం ప్రపంచానికి సరికొత్త అభివృద్ధి నమూనాలను అందిస్తోందని చెప్తూ.. భారత్ సాధించిన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విజయాల పట్ల నేడు ప్రపంచవ్యాప్తంగా డజన్ల కొద్దీ దేశాలు ఎంతో ఆసక్తి చూపుతున్నాయని ప్రధాని మోదీ సగర్వంగా ప్రకటించారు.

# దేశంలో తొలి సీఎంపీ ప్యాడ్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సెమీకండక్టర్ల తయారీ రంగంలో తెలంగాణ మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో చిప్‌ల తయారీలో అత్యంత కీలకమైన కెమికల్ మెకానికల్ పాలిషింగ్ (సీఎంపీ) ప్యాడ్ టెక్నాలజీకి సంబంధించిన దేశంలోనే తొలి హబ్ హైదరాబాద్‌లో ఏర్పాటైంది. జపాన్‌కు చెందిన తోహో కోకి సీసాకుషో కంపెనీ లిమిటెడ్ సహకారంతో టీ-వర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం లాంఛనంగా ప్రారంభించారు.

**ప్రణాళికాబద్ధంగా కృషి:**

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ… తెలంగాణను దేశంలోనే ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ లక్ష్య సాధనలో తాజాగా ప్రారంభించిన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ హబ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సెమీకండక్టర్ చిప్‌ల తయారీలో వాఫర్‌ను సమతలంగా మార్చేందుకు ఉపయోగించే ఈ సీఎంపీ ప్యాడ్లను ప్రస్తుతం పూర్తిగా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ హబ్ ఏర్పాటుతో ఇప్పటివరకు విదేశాలకే పరిమితమైన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ తొలిసారిగా దేశంలో హైదరాబాద్ వేదికగా అందుబాటులోకి వచ్చిందన్నారు.

**ప్రత్యేక రోడ్‌మ్యాప్:**

విద్యార్థులు, పరిశోధకులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు ఈ కేంద్రం ద్వారా శిక్షణతో పాటు పరిశోధనలు చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. ప్రముఖ విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల భాగస్వామ్యంతో వచ్చే 18 నుంచి 24 నెలల్లో సీఎంపీ ప్యాడ్లను దేశంలోనే తయారు చేసేలా సంయుక్త పరిశోధనలు చేపడతామని వివరించారు. సెమీకండక్టర్ రంగంలోని అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు జపాన్ లాంటి దేశాలతో కలిసి ముందుకు సాగుతున్నామన్నారు. పరిశోధన నుంచి చిప్‌ల తయారీ వరకు అవసరమైన సమగ్ర ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తోహో కోకి సీసాకుషో కంపెనీ లిమిటెడ్ ప్రతినిధి టకుయా నిషిమురా, జెట్రో బెంగళూరు డైరెక్టర్ జనరల్ స్వస్తిక్ కులకర్ణి, ఇండోబాక్స్ వ్యవస్థాపకుడు, సీఈవో డైసుకే టాంజి, జపాన్ ఇండియా బిజినెస్ బ్యూరో ఛైర్మన్ షిగెమారో యాసుయి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ-వర్క్స్ సీఈవో జోగిందర్ తనికెళ్ల తదితరులు పాల్గొన్నారు.

# వియత్నాంలో ఘోర విషాదం..

**న్యూ ఢిల్లీ:** వియత్నాంలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన ఫూ కుయోక్ ఐలాండ్ సమీపంలో శనివారం తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. పలువురు భారతీయ పర్యాటకులతో వెళ్తున్న పర్యాటక బోటు సముద్రంలో ప్రమాద వశాత్తు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది భారతీయులు మరణించినట్లు తెలుస్తోంది. వారిలో ఏపీ, తెలంగాణకు చెందిన టూరిస్టులు ఉన్నట్లు సమాచారం. కడపకు చెందిన శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన జయశ్రీ, కాకినాడకు చెందిన మరో యువకుడు మృతి చెందగా.. ఏపీకి చెందిన మరో నలుగురు గల్లంతైనట్లు సమాచారం. స్థానిక రెస్క్యూ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి గల్లంతైన వారికోసం గాలిస్తున్నారు. పలువురిని రక్షించిన రెస్క్యూ సిబ్బంది.. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. దీనిపై భారత రాయబార కార్యాలయం ఎక్స్ వేదికగా స్పందించింది. బాధిత కుటుంబాలకు సమాచారం అందించేందుకు హో చి మిన్ సిటీలోని భారత కాన్సులేట్ జనరల్ లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది. హనోయ్ లో కూడా మరో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొంది. బాధిత కుటుంబ సభ్యులు హో చి మిన్ సిటీ కంట్రోల్ రూమ్: +84 36 281 7930, +84 91 552 37 14, +84 33 452 0414, హనోయ్ కంట్రోల్ రూమ్: +84 91 308 9165 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపింది. ప్రమాదంలో మృతి చెందిన టూరిస్టులపై ఎంబసీ అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ప్రముఖ సెల్ ఫోన్ కంపెనీ.. తమ డిస్ట్రిబ్యూటర్లకు ఏర్పాటు చేసిన విహారయాత్రలో భాగంగానే వారంతా వియత్నాం వెళ్లినట్లు సమాచారం. మొత్తం 250 మంది భారతీయులను టూర్ కు తీసుకెళ్లగా.. వారిలో ఏపీకి చెందినవారు 35 మంది, తెలంగాణకు చెందినవారు 45 మంది ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. ప్రమాదం జరిగిన సమయంలో ఆన్ థోయ్ సముద్ర ప్రాంతంలో అలలు తీవ్రంగా ఉన్నాయని, వర్షం లేకపోయినప్పటికీ సముద్రం అల్లకల్లోలంగా ఉండగా.. పర్యాటక బోట్లు యథావిధిగా తిరిగాయని పేర్కొంది. మరోవైపు ప్రమాదానికి గల కారణాలు, ప్రయాణికుల పరిస్థితి, ప్రమాద సమయంలో బోటులో ఎంతమంది ఉన్నారన్నదానిపై స్థానిక పోలీసులు, అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

**ప్రధాని మోడీ తీవ్ర సంతాపం..**

ఈ విషాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 'వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో భారతీయులు ప్రాణాలు కోల్పోవడం నన్ను తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు నా సానుభూతి. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, కాన్సులేట్ అధికారులు స్థానిక ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. బాధితులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నాం' అని ప్రధాని మోడీ 'X' (ట్విట్టర్) వేదికగా పేర్కొన్నారు. ప్రస్తుతం భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.

**తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం**

ఈ ఘటనలో క్షతగాత్రులకు అవసరమైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. బాధితులకు తమ ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా కల్పించారు. బాధితుల కుటుంబాల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. 4 హెల్ప్‌లైన్ నంబర్లు విడుదల చేసినట్లు చెప్పుకొచ్చారు. సమాచారం కోసం వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:9885371189,7997959754,9989654807,7997959779

# వియత్నాం బోటు ప్రమాదంపై హోంమంత్రి అనిత ఆరా

**ఆంధ్రప్రదేశ్ :**వియత్నాం బోటు ప్రమాదంపై హోంమంత్రి అనిత ఆరా తీశారు. అధికారులతో మాట్లాడి ప్రమాదం వివరాలను తెలుసుకున్నారు. భారత ఎంబసీతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. టూరిస్టుల వివరాలు సేకరించివ వారికి సహాయం చేయాలని చెప్పారు. ఇదిలా ఉంటే వియత్నాంలో పెను విషాదం చోటు చేసుకుంది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో భారతీయ ప్రయాణికులు వెళుతున్న బోటు అలల దాటికి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో 19 మంది మరణించారు. వెంటనే సహాయకబృందాలు రంగంలోకి దిగి కొందరిని రక్షించాయి. రక్షించిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం అందుతోంది. బాధితులు ఓ మొబైల్ కంపెనీ డీలర్స్ కాగా, ఆ కంపెనీ తరపున టూర్ కు వెళ్లారు. టూరిస్టుల్లో ఏపీ నుండి 30 మంది, తెలంగాణ నుండి 45 మంది ఉన్నారు. మృతుల్లో ఎక్కువగా తెలుగు రాష్ట్రాలకు చెందినవాళ్లే ఉన్నారని చెబుతున్నారు. ఏపీ నుండి ఎక్కువ మంది ఉండటంతో హోంమంత్రి అనిత వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు.

# మార్చి 2027 నాటికి భూ రీ-సర్వే పూర్తి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్ర వ్యాప్తంగా భూ రీ సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ, తదితర అంశాలపై మంత్రి శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యలను పరిష్కరించినప్పటికీ, అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**భూ రీ-సర్వే తప్పనిసరి..**

భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందుకోసం శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ఆయా గ్రామాల రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రీ-సర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకొని, అవసరమైన సిబ్బంది, పరికరాలు, మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు. ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పురోగతిని సమీక్షిస్తామని, మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ. 50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు. చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జూలై 28లోపు విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. వారికి బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా తీసుకుంటామని వెల్లడించారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి, నోటీసులు త్వరితగతిన జారీ చేయాలని సూచించారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు అనంతరం నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హుల ఇళ్లను కూడా రెండో విడతలో చేర్చి మంజూరు చేయాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# జగ్గారెడ్డి సెన్సేషనల్ కామెంట్స్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను సంగారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేయనని స్పష్టం చేసిన ఆయన.. అయితే వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేయనని ఎక్కడా చెప్పలేదని పేర్కొన్నారు. తాను ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పూర్తిగా పార్టీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని జగ్గారెడ్డి గుర్తు చేశారు. అలాగే కాంగ్రెస్ 117 స్థానాల్లో విజయం సాధించాలని సీఎం లక్ష్యంగా పెట్టుకోవడం మంచి ఆలోచన అని అన్నారు. ఎన్నికలకు రెండేళ్ల ముందే పార్టీని సిద్ధం చేయడం రాజకీయ నాయకుడిగా సీఎం తీసుకున్న సరైన నిర్ణయమని అభిప్రాయపడ్డారు.ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇవ్వాలనేది వ్యక్తిగత నిర్ణయం కాదని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపికను పార్టీ, ఇన్‌చార్జి, ఏఐసీసీ కలిసి నిర్ణయిస్తాయని చెప్పారు. పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత సీఎంపై ఉంటుందని, అందుకు అనుగుణంగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ నివేదికల ఆధారంగా ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరుపై ముఖ్యమంత్రి స్పందించడం సహజమని జగ్గారెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధుల పనితీరును సమీక్షించే హక్కు సీఎంకు ఉంటుందని చెప్పారు. సీఎం ఇచ్చే సూచనలను ఎమ్మెల్యేలు స్వీకరించి తమ పనితీరును మెరుగుపరచ్చుకుంటే వారికి రాజకీయంగా ప్రయోజనం ఉంటుందని సూచించారు. అలాగే పనితీరు మార్చుకోని ఎమ్మెల్యేలకు టికెట్ ఇవ్వాలా లేదా అనే విషయాన్ని కూడా పార్టీ నాయకత్వం పరిశీలించే అవకాశం ఉంటుందని అన్నారు.మరోవైపు ప్రతిపక్ష పార్టీలు చేసే సర్వేలపై కూడా జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ నిర్వహించే సర్వేల్లో ఆ పార్టీకి అనుకూల ఫలితాలే వస్తాయని, అలాగే బీజేపీ కూడా తమకు అనుకూలంగా అధికారంలోకి వస్తామని చెప్పే సర్వేలను ప్రచారం చేస్తుందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షం ఎప్పుడూ అధికార పార్టీని బలహీనపరిచే ప్రయత్నమే చేస్తుందని, అదే రాజకీయ స్వభావమని అన్నారు.ప్రస్తుత ఎమ్మెల్యేలకు జగ్గారెడ్డి కీలక సూచనలు చేశారు. "మేం తోపులం" అనే భావనలో ఉంటే అది పొరపాటేనన్నారు. గతంలో ఎంతో బలమైన నాయకులుగా భావించిన వారే ఎన్నికల్లో ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలు బలంగా కనిపించినా, ఎన్నికల సమయంలో బి-ఫారం ఇచ్చే అధికారం సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ నాయకత్వం చేతుల్లోనే ఉంటుందని చెప్పారు. వారు అంగీకరించకపోతే టికెట్ దక్కదని స్పష్టం చేశారు.సంగారెడ్డి నియోజకవర్గంలో నిర్మల పోటీ చేస్తారని జగ్గారెడ్డి తెలిపారు. అయితే తాను ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పడం లేదని, కేవలం సంగారెడ్డి నుంచి మాత్రమే పోటీ చేయనని స్పష్టం చేశారు. వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేయాలా.? వద్దా.? అనేది పూర్తిగా పార్టీ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. జగ్గారెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో వచ్చే ఎన్నికల అభ్యర్థుల ఎంపికపై కొత్త చర్చకు దారితీశాయి. ముఖ్యంగా సంగారెడ్డి కాకుండా మరో నియోజకవర్గం నుంచి ఆయన బరిలోకి దిగే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

# తెలంగాణలో పెట్టుబడులకు ఎమిరైట్స్ ఆసక్తి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అంతర్జాతీయ విమానయాన రంగంలో హైదరాబాద్ మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద లగ్జరీ ప్రయాణీకుల విమానమైన 'ఎమిరేట్స్ A-380' సర్వీసులను హైదరాబాద్ నుంచి ప్రారంభించేందుకు ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థ ఎమిరేట్స్ సానుకూలత వ్యక్తం చేసింది. శనివారం ఎమిరేట్స్ విమానయాన సంస్థ (ఇండియా - నేపాల్) వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సర్హన్.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ విమానయాన సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారు ముఖ్యమంత్రి భేటీ అయ్యారు.

**వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులపై సీఎం ఫోకస్**

హైదరాబాద్‌లో ఎమిరేట్స్ A-380 సర్వీసులను ప్రారంభించడంతో పాటు సంస్థ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని ముఖ్యమంత్రి వారిని కోరారు. ఇందుకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు, సౌకర్యాలను కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. అలాగే తెలంగాణలో కొత్తగా అభివృద్ధి చేయ తలపెట్టిన వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రాధాన్యతను ముఖ్యమంత్రి ఈ భేటీలో వివరించారు. రాష్ట్రంలో విమానయాన రంగానికి ఉన్న విస్తృత అవకాశాలను అందిపుచ్చుకుంటూ, తెలంగాణలోనే ఎమిరేట్స్ సంస్థకు సంబంధించిన MRO (మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్) ఆపరేషన్స్‌ను ప్రారంభించాలని కోరారు. .

**గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీకి స్పాన్సర్‌షిప్:**

విమానయాన రంగానికే పరిమితం కాకుండా, గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్ ఇవ్వాల్సిందిగా ఎమిరేట్స్ యాజమాన్యాన్ని సీఎం కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ సర్వీసులను ప్రారంభించడానికి మహమ్మద్ సర్హన్ సానుకూలతను వ్యక్తం చేశారు. అలాగే క్రీడాకారులను ప్రోత్సహించే విషయంలో స్పాన్సర్‌షిప్ అందించడంపైన వారు సానుకూలంగా స్పందించారు. ఈ భేటీతో రాబోయే రోజుల్లో తెలంగాణకు అంతర్జాతీయ పెట్టుబడులు, విమాన సర్వీసులు మరింత పెరిగే అవకాశం ఉంది.

# వియత్నాం బోటు ప్రమాదంపై మంత్రి లోకేశ్ ఆరా

**ఆంధ్రప్రదేశ్ :** వియత్నాంలో విహారయాత్రకు వెళ్లిన భారతీయ పర్యాటకుల బోటు ఫూ క్వాక్ ద్వీపం సమీపంలో బోల్తా పడగా.. 15 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఏపీకి చెందిన ముగ్గురు మరణించగా.. మరొక వ్యక్తి తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మచిలీపట్నానికి చెందిన కిశోర్ తీవ్ర అస్వస్థతకు గురవ్వగా.. ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై ఏపీ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. వియత్నాంలోని భారత ఎంబసీ అధికారులతో మాట్లాడి.. వెంటనే బాధితులకు, వారి కుటుంబాలకు సహాయం అందేలా చూడాలని కోరారు. ప్రమాదంలో చిక్కుకున్న తెలుగువారందరికీ అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వియత్నాంలో జరిగిన బోటుప్రమాద ఘటనపై దేశ, రాష్ట్ర ఉన్నతాధికారులతో నారాలోకేశ్ మాట్లాడారు.అలాగే ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సైతం మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఏపీ నుంచి విహారయాత్రకు వెళ్లిన పర్యాటకుల వివరాలు వెంటనే పంపాలని ఆదేశించారు. బోటు ప్రమాదంపై ఎప్పటికప్పుడు భారత రాయబార కార్యాలయంతో మాట్లాడుతున్నామని అధికారులు మంత్రికి తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వంతో అధికారులు సమన్వయం చేసుకుని బాధితులకు సహాయం అందించాలని లోకేశ్ ఆదేశించారు.



## యాదగిరిగుట్టను దేశంలోనే ఆదర్శ ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దాలి

**యాదాద్రి భువనగిరి,ఫ్లాష్ ఇండియా :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని దేశంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా, రాష్ట్రానికి తలమానికంగా తీర్చిదిద్దేందుకు నూతన ట్రస్ట్ బోర్డు సమిష్టిగా కృషి చేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. శనివారం యాదగిరిగుట్టలో నిర్వహించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేవస్థానానికి చేరుకున్న మంత్రి కొండా సురేఖకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, దేవస్థానం ఈవో జె. భవానీశంకర్ స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.మంత్రి సమక్షంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎం. సత్యనారాయణ రెడ్డి, సభ్యులు, ఎక్స్అఫీషియో సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం నూతన చైర్మన్, సభ్యులను మంత్రి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. యాదగిరిగుట్టకు తొలి ట్రస్ట్ బోర్డుగా నియమితులైన చైర్మన్, సభ్యులు ప్రజల అంచనాలకు అనుగుణంగా పనిచేస్తూ ఆలయ అభివృద్ధి, పారదర్శక పాలన, భక్తులకు మరిన్ని సౌకర్యాల కల్పన పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆలయ పవిత్రత, సంప్రదాయాలను పరిరక్షిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని, ట్రస్ట్ బోర్డు సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి దేవస్థానం ఖ్యాతిని మరింత పెంచాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఎక్స్అఫీషియో సభ్యులు, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్లు ఇవ్వకుంటే గుర్తింపు రద్దు చేస్తాం

**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఫీజుల బకాయిల పేరుతో విద్యార్థులకు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు (టీ.సీ), బోనాఫైడ్ సర్టిఫికెట్లు, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడే ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) తిరుమలపూడి రవికుమార్ హెచ్చరించారు. ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలు ఉల్లంఘించే కళాశాలల గుర్తింపును రద్దు చేసేలా చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. గత మార్చి వార్షిక పరీక్షలు, మే సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల పై చదువుల కోసం అవసరమైన సర్టిఫికెట్లు వారికి వెంటనే అందజేయాలని కళాశాల యాజమాన్యాలకు సూచించారు. ఫీజుల చెల్లింపు పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం బోర్డు నిబంధనలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే సంబంధిత కళాశాలల పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్టిఫికెట్ల జారీ విషయంలో ప్రైవేటు కళాశాలలు ఇబ్బందులు కలిగిస్తే విద్యార్థులు, తల్లిదండ్రులు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న కళాశాలల వివరాలను ఇంటర్ బోర్డుకు నివేదిస్తామని డీఐఈఓ తిరుమల పూడి రవికుమార్ వెల్లడించారు.

# కాంగ్రెస్‌కు 7 సీట్లు కూడా రావు.!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలు, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సంక్షోభంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి తెలంగాణ రైతాంగాన్ని నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి అయినా సీఎం సోయి తెచ్చుకోవాలని డిమాండ్ చేశారు.

**మేడిగడ్డతో పని లేకుండానే నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు..**

మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కేవలం కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిన విషయాన్ని కేటీఆర్ బహిర్గతం చేశారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల మేర నీటి ప్రవాహం ఉందన్నారు. కానీ కేవలం 94 మీటర్ల లభ్యత ఉంటేనే పంపులను ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేయవచ్చని నిపుణులు స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ ప్రకృతి ప్రసాదించిన ఈ ప్రవాహం మరో 100 రోజులు ఇలాగే ఉంటుందని తెలిపారు. రోజుకు 2 టీఎంసీల చొప్పున మొత్తం 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే.. గోదావరి బేసిన్‌లోని అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు.

**ఇది కాలం తెచ్చిన కరువు కాదు..**

రాష్ట్రంలో నీళ్ల లేక రైతులు ఏడుస్తుంటే, కాళేశ్వరం ప్రాజెక్టు ను బద్నాం చేయాలనే కుట్రతోనే సీఎం రేవంత్ రెడ్డి నీళ్లివ్వడం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని ఎద్దేవా చేశారు. 2022 వరదల ఫోటోలు చూపించి కన్నెపల్లి మునిగిపోయిందంటూ అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు వల్ల మునిగే భద్రాచలాన్ని పట్టుకుని.. మేడిగడ్డ వల్లే మునుగుతోందని బుద్రలేని మాటలు రేవంత్ మాట్లాడుతుండని కేటీఆర్ ఫైర్ అయ్యారు గోదావరిలో లక్షల క్యూసెక్కుల వరద నీరు కళ్లముందు కిందకు పోతుంటే.. ఎత్తిపోయడానికి నీళ్లు లేవనేవాడు బుద్రతక్కువ వాడా? లేక రైతుల కోసం నీళ్లివ్వమనేవాడు బుద్రతక్కువ వాడా? అని కేటీఆర్

**హరీష్‌రావు కేసీఆర్ తయారు చేసిన సైనికుడు**

ఇక మాజీ మంత్రి హరీష్ రావు పై వస్తున్న పుకార్లను కేటీఆర్ గట్టిగా తిప్పికొట్టారు. హరీష్ రావు పార్టీ ఆవిర్భావం కంటే ముందు నుంచే కేసీఆర్‌కు రక్షణ కవచంగా నిలిచిన సైనికుడని కేటీఆర్ కొనియాడారు. తనపై వచ్చిన పుకార్లను ఆయన వందల సార్లు తిప్పికొట్టారని అన్నారని.. తమకు క్యారెక్టర్ చాలా ముఖ్యమని అన్నారు. నాలుగు పార్టీలు మారిన రేవంత్ రెడ్డి.. హరీష్ రావు శీల పరీక్ష గురించి మాట్లాడటం హాస్యాస్పదమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోతే పొద్దున కాంగ్రెస్‌తో, రాత్రికి బీజేపీ వాళ్లతో ఉంటారని.. శీల పరీక్ష చేయాల్సింది రేవంత్ రెడ్డికేనని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పాలన ఇలాగే ఉంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు 117 అసెంబ్లీ స్థానాలు కాదు కదా.. కనీసం 7 సీట్లు కూడా రావని కేటీఆర్ కామెంట్ చేశారు.

# కిలాడీ కమిటీలో రాజేందర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈటల రాజేందర్ అంటే తమకు ఎంతో గౌరవం ఉందని, కానీ కాళేశ్వరం విషయంలో ఆయన అసత్యాలు మాట్లాడి ఆ గౌరవాన్ని కోల్పోతున్నారని సీఎం పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఇచ్చిన సూచనలతోనే ఈటల రాజేందర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుకూలంగా కామెంట్స్ చేశారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఒక బీజేపీ ఎంపీలా కాకుండా, బీఆర్ఎస్ నేతలా ఈటల మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

**బీఆర్ఎస్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు తేలాయి..**

మేడిగడ్డ బ్యారేజ్లో తీవ్రమైన లోపాలు ఉన్నాయని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తేలిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రాజెక్టు ప్రారంభించిన కేవలం 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని, ఆ సమయంలోనే వాటిని సవరించాలని ఇంజినీర్లు మొత్తుకున్నా.. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. మొదట్లోనే ఆ లోపాలను సరిదిద్ది ఉంటే సమస్య ఇంత పెద్దది అయ్యేది కాదని. నాటి పాలకుల నిర్లక్ష్యం వల్లే నేడు మేడిగడ్డ బ్యారేజ్ కుప్పకూలే పరిస్థితి ఏర్పడిందని రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు.

**కన్నెపల్లి పంప్ హౌజ్ ఇప్పటికీ కోలుకోలేదు..**

2022లో వచ్చిన వరదలకు కన్నెపల్లి పంప్ హౌజ్ పూర్తిగా దెబ్బతిన్న విషయాన్ని సీఎం ప్రస్తావించారు. నాటి నుంచి నేటి వరకు ఆ పంప్ హౌజ్ ఇప్పటికీ పూర్తిగా వినియోగంలోకి రాలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్డీఎస్ఏ (NDSA) ఈ లోపాలపై నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు ఏమాత్రం అనుకూలం కాదని ఎన్డీఎస్ఏ స్పష్టంగా తేల్చి చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణాల్లో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఆ సంస్థ పేర్కొందన్నారు. కేవలం ప్రాథమిక రిపోర్టులోనే కాకుండా, ఫైనల్ రిపోర్టులోనూ ఎన్డీఎస్ఏ ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని, అలాంటప్పుడు ఈటల రాజేందర్ బీఆర్ఎస్ తప్పులను వెనకేసుకురావడం వెనుక అంతరార్థం ఏంటనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

**పారుతున్న నీళ్లను ఎత్తిపోస్తే బ్యారేజీలు ఎందుకు?..**

కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలు చెబుతున్నారు సీఎం రేవంత్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఈ 3 బ్యారేజీల్లో నీరు నింపకూడదని ఎన్డీఎస్ఏ స్పష్టంగా చెప్పిందన్నారు. ఇవాళ హైదరాబాద్ లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ చెబుతున్నట్లు కళ్లముందు నీళ్లు పారుతున్నంత మాత్రాన ఎత్తిపోసే అవకాశం ఉంటే బ్యారేజీలు కట్టే అవసరం ఏముందని ప్రశ్నించారు. బ్యారేజీలు కట్టడం అంటేనే పారుతున్న నీళ్లను నిలిపి వాటిని ఎత్తిపోయాల్సి ఉంటుందన్నారు. కన్నెపల్లి దగ్గర ఎత్తిపోతలకు అవకాశమే లేదని 93.5 మీటర్ల ఎత్తులో నీరు నిలిపితేనే ఎత్తిపోతల సాధ్యం అవుతుందన్నారు. ఈటల రాజైందర్ అంటే మాకు గౌరవమే కానీ కాళేశ్వరం విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలతో రాజేందర్ తన గౌరవం కోల్పోయారన్నారు. హరీశ్ రావు సూచనలతో ఈటల రాజేందర్ మాట్లాడారని కాళేశ్వరంపై రాజేందర్ అవాస్తవాలు చెప్పారన్నారు. బీఆర్ఎస్ నేతల వాదననే బీజేపీ ఎంపీ ఈటల వినిపించారన్నారు.

**కిలాడీ కమిటీలో రాజేందర్:**

మేడిగడ్డలో లోపాలు ఉన్నాయని ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు ఉన్నట్లు గత ప్రభుత్వంలో ఈఈ రమణారెడ్డి లేఖ రాశాని రేవంత్ రెడ్డి చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు సరిచేయకుంటే ఇబ్బందని లేఖలో పేర్కొన్నారన్నారు. నాడు రాసిన లేఖ పట్ల నిర్లక్షఅయం వహించడం వల్లే మేడిగడ్డ కుప్పకూలిందన్నారు. మేడిగడ్డలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతూ ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని ప్లానింగ్, డిజైన్, నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందన్నారు. 2022 జులైలో కన్నెపల్లి పంప్ హౌస్ మునిగిపోతే సరిచేయలేదన్నారు. ఎన్డీఎస్ఏ క్షేత్రస్థాయిలో పనిచేసేలా 2021 లో కేంద్రం చట్టం చేసింది. ఎన్డీఎస్ఏ మేడిగడ్డను సందర్శించి.. అందులో నీటి నిల్వ సాధ్యం కాదని చెప్పిందన్నారు. సీడబ్ల్యూసీ ప్రకారమే ప్రాజెక్టుపై ముందుకెళ్లాలని ఎన్డీఎస్ఏ చెప్పింది. 80 వేల పుస్తకాలు చదివిన మేధావుల మాటలుగానీ.. ఖిలాడీ కమిటీల సూచనలు గానీ పట్టించుకోవద్దని ఎన్డీఎస్ఏ చెప్పిందన్నారు. ఎత్తిపోతల అంటే ఏంటో అమెరికాలో చదివిన కేటీఆర్ కు తెలియదా అని ప్రశ్నించారు. ఎన్డీఎస్ఏ నివేదిక మేరకే కమిటీ వేసి బ్యారేజీల పునరుద్ధరణకు యత్నిస్తామన్నారు. మమ్మల్ని బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ప్రజల ముందు 2 కమిటీలు ఉన్నాయని ఒకటి కిలాజీ కమిటీ రెండోది ఎన్డీఎస్ఏ వేసిన కమిటీ ఉందన్నారు. కిలాడీ కమిటీలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఈటల సభ్యులుగా ఉన్నారని మండిపడ్డారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయండి




**నిజామాబాద్,ఫ్లాష్ ఇండియా :** టీపీసీసీ చీఫ్ సొంత నియోజకవర్గం నిజామాబాద్ అర్బన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయడం పార్టీ శ్రేణులు బాధ్యతగా తీసుకోవాలని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జీలు, బీఎల్ఏ సూపర్‌వైజర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియ పై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జీలు, బీఎల్ఏ సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి ఓటరికి చేరువ కావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను అర్బన్ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఇది పీసీసీ అధ్యక్షుడి సొంత నియోజకవర్గం కావడంతో పార్టీ నాయకులు మరింత బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్‌కు మెంటర్లను నియమించినట్లు ఆయన తెలిపారు. డివిజన్‌లలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి పార్టీ నాయకులు కలిసి ఓటర్లకు ఫారాలు నింపడంలో సహాయపడాలని సూచించారు. ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నుంచి ఫారాలు సేకరించి వాటిని నింపేందుకు వాలంటీర్లను నియమించాలని పేర్కొన్నారు. కాంటెస్టెడ్ కార్పొరేటర్లు, కార్పొరేటర్లు, బీఎల్ఏ సూపర్‌వైజర్లు తమ తమ డివిజన్‌లలో ప్రత్యేకంగా వాలంటీర్లను నియమించుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని రామకృష్ణ సూచించారు. ఈ సమావేశంలో నుడా చైర్మన్ కేశ వేణు, ఎస్ఐఆర్ అర్బన్ కో-ఆర్డినేటర్ ఆకుల లలితలతో పాటు సీనియర్ నాయకులు రత్నాకర్, జావీద్ అక్రమ్, అర్బన్ ఈఆర్‌వో కో-ఆర్డినేటర్ అబ్దుల్ వహీద్, డీసీసీ ఉపాధ్యక్షుడు రత్నాకర్ గౌడ్, డీసీసీ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు విజయ్ పాల్ రెడ్డి, సలీం, కోశాధికారి సకినాల శివ, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, బీఎల్ఏ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# అప్పుల ఊబిలో జీహెచ్ఎంసీ

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని మూడు ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్ల ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. ఒకే మహానగర పరిధిలో పనిచేస్తున్న మూడు కార్పొరేషన్లలో రెండు సంస్థలు ఆదాయాన్ని పెంచుకుంటూ మిగులు బడ్జెట్ దిశగా సాగుతుండగా, ఒకప్పుడు దేశంలోనే అత్యంత ఆర్థికంగా బలమైన స్థానిక సంస్థగా పేరొందిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) మాత్రం వేల కోట్ల రూపాయల అప్పులతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితి కేవలం ఆర్థిక నిర్వహణకు సంబంధించిన అంశమే కాదు. స్థానిక సంస్థల ఆదాయ వనరులు, ప్రభుత్వ విధానాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రుణాల నిర్వహణ వంటి అనేక అంశాలకు ఇది అద్దం పడుతోంది.కొత్తగా ఏర్పాటు చేసిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)లు తమ పరిధిలో ఆదాయ వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాయి. సీఎంసీ ఇప్పటికే సుమారు రూ.200 కోట్లను, ఎంఎంసీ రూ.150 కోట్లను ఫిక్స్ డిపాజిట్ల రూపంలో నిల్వ ఉంచడం వాటి ఆర్థిక స్థిరత్వానికి నిదర్శనంగా చెప్పవచ్చు. మరోవైపు జీహెచ్ఎంసీ మాత్రం రూ.4,700 కోట్లకు చేరువైన అప్పులను మోస్తూ నెలవారీ వడ్డీలు, రుణ చెల్లింపులతో ముందుకు సాగుతోంది. ఒకే నగర పరిధిలో ఇంత భిన్నమైన ఆర్థిక పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది.సీఎంసీ విజయానికి ప్రధాన కారణం దాని ఆదాయ సామర్థ్యం. ఈ కార్పొరేషన్ పరిధిలో దేశంలోని ప్రముఖ ఐటీ కంపెనీలు, కార్పొరేట్ కార్యాలయాలు, బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయాలు, ఆధునిక నివాస టౌన్‌షిప్‌లు అధికంగా ఉన్నాయి. ఆస్తిపన్ను రూపంలోనే భారీ ఆదాయం సమకూరుతోంది. అంతేకాదు, బిల్డింగ్ పర్మిషన్లు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్), అభివృద్ధి అనుమతులు వంటి వివిధ మార్గాల ద్వారా కూడా పెద్ద మొత్తంలో ఆదాయం లభిస్తోంది. ఈ ఏడాది ఎర్లీబర్డ్ ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లలోనే రూ.500 కోట్లకు పైగా వసూలు చేయడం ఈ కార్పొరేషన్ ఆర్థిక సామర్థ్యాన్ని స్పష్టం చేస్తోంది.మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిస్థితి కూడా ఆశాజనకంగానే ఉంది. ఈ ప్రాంతంలో వేగంగా పెరుగుతున్న నివాస కాలనీలు, టౌన్ ప్లానింగ్ అనుమతులు, ఆస్తిపన్ను వసూళ్లు సంస్థకు స్థిరమైన ఆదాయాన్ని అందిస్తున్నాయి. ప్రతి నెల ఉద్యోగుల జీతాలు, నిర్వహణ వ్యయాలు, చిన్న కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించిన తర్వాత మిగిలిన నిధులను ఫిక్స్ డిపాజిట్లుగా నిల్వ చేయడం ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనం. ఈ నిల్వలు భవిష్యత్తులో పెద్ద ప్రాజెక్టులకు రుణాలు పొందే సమయంలో ఆర్థిక భరోసాగా కూడా ఉపయోగపడే అవకాశం ఉంది.అయితే జీహెచ్ఎంసీ పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. గత పదేళ్లలో హైదరాబాద్ నగరంలో భారీ స్థాయిలో ఫ్లైఓవర్లు, రోడ్లు, స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఆర్‌డీపీ) వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టబడ్డాయి. వీటిలో చాలా వరకు రుణాల ద్వారానే నిధులు సమీకరించారు. అభివృద్ధి పనులు నగరానికి అవసరమే అయినప్పటికీ, వాటి వల్ల ఏర్పడిన రుణభారం ఇప్పుడు జీహెచ్ఎంసీపై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చింది. ప్రస్తుతం వేల కోట్ల రూపాయల అప్పులకు వడ్డీలు, అసలు చెల్లింపులు సంస్థ ఆర్థిక వ్యవస్థపై భారంగా మారాయి.2017 తర్వాత జీహెచ్ఎంసీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెద్దగా ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందకపోవడం కూడా సంస్థ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్పులను ప్రభుత్వం తనపైకి తీసుకుంటుందనే ప్రచారం కొంతకాలంగా కొనసాగింది. అధికారులు కూడా ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. అయితే ప్రభుత్వం మాత్రం ఆ ప్రతిపాదనలను ఆమోదించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అప్పులను స్వీకరిస్తే రాష్ట్ర రుణ పరిమితిపై ప్రభావం పడే అవకాశం ఉండటంతో ఆ నిర్ణయానికి ముందుకు రాలేదని తెలుస్తోంది. దానికి బదులుగా ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన ఆస్తిపన్ను బకాయిలను విడతలవారీగా చెల్లించే విధానాన్ని ఎంచుకుంది.ఇక మరోవైపు సీఎంసీ ఇప్పటికే భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిధుల సమీకరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సుమారు రూ.2,500 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులకు అవసరమైన నిధులను భవిష్యత్తులో మున్సిపల్ బాండ్ల ద్వారా సమీకరించే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఫిక్స్ డిపాజిట్లు, సంస్థ ఆస్తులు, భూముల లీజులు, షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆధారంగా చేసుకుని దీర్ఘకాలిక ఆర్థిక వ్యూహాన్ని రూపొందిస్తున్నారు. ఎంఎంసీ కూడా ఇదే తరహా విధానాన్ని అనుసరించేందుకు సిద్ధమవుతోంది.జీహెచ్ఎంసీ పరిస్థితిని పరిశీలిస్తే ఒకప్పుడు ఉన్న ఆర్థిక బలం ఇప్పుడు ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్నకు చరిత్రే సమాధానం చెబుతోంది. 2013 వరకు జీహెచ్ఎంసీ ఖజానాలో వెయ్యి కోట్ల రూపాయలకు పైగా ఫిక్స్ డిపాజిట్లు ఉండేవి. దేశంలోని అత్యంత సంపన్న స్థానిక సంస్థలలో ఒకటిగా బల్దియా గుర్తింపు పొందింది. అవసరమైనప్పుడు ఇతర ప్రభుత్వ శాఖలకు కూడా నిధులు అందించే స్థాయిలో ఉండేది. కానీ తరువాతి కాలంలో భారీ అభివృద్ధి ప్రాజెక్టులు, పెరుగుతున్న వ్యయాలు, తగ్గుతున్న నిల్వలు, రుణాలపై ఆధారపడే పరిస్థితి సంస్థను క్రమంగా అప్పుల ఊబిలోకి నెట్టాయి. ఒకప్పుడు ఫిక్స్ డిపాజిట్లతో పేరొందిన జీహెచ్ఎంసీ ఇప్పుడు ఓవర్‌డ్రాఫ్ట్ పరిస్థితిని ఎదుర్కొనడం ఆర్థిక నిర్వహణలో వచ్చిన మార్పులను స్పష్టంగా తెలియజేస్తోంది.అయితే ఈ పరిస్థితిని కేవలం జీహెచ్ఎంసీ వైఫల్యంగా మాత్రమే చూడడం సరైంది కాదు. హైదరాబాద్ వంటి మహానగరంలో మౌలిక సదుపాయాల విస్తరణకు భారీ పెట్టుబడులు అవసరం. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్య, ట్రాఫిక్ సమస్యలు, నగర విస్తరణ వంటి అంశాలు పెద్దఎత్తున పెట్టుబడులను తప్పనిసరి చేస్తాయి. అలాంటి సమయంలో రుణాలు తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టడం అసాధారణం కాదు. కానీ రుణాలకు అనుగుణంగా స్థిరమైన ఆదాయ వనరులను పెంచుకోవడం, అప్పుల నిర్వహణకు స్పష్టమైన వ్యూహం రూపొందించడం కూడా అంతే అవసరం.ఇక్కడే సీఎంసీ, ఎంఎంసీ అనుసరిస్తున్న విధానం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఈ రెండు సంస్థలు కొత్తవైనా ఆదాయ వనరులను విస్తరించడంపై దృష్టి పెట్టాయి. ఆస్తుల వినియోగం, పన్నుల వసూళ్లు, టౌన్ ప్లానింగ్ అనుమతులు, డిజిటల్ సేవల విస్తరణ వంటి అంశాలను సమన్వయం చేస్తూ ఆర్థిక స్థిరత్వాన్ని సాధించే ప్రయత్నం చేస్తున్నాయి. భవిష్యత్తులో ఈ ఆదాయాన్ని మరింత పెంచుకుంటే అవి పెద్ద ప్రాజెక్టులను కూడా అప్పుల భారం లేకుండా చేపట్టే అవకాశముంది.స్థానిక సంస్థల ఆర్థిక స్వావలంబన అనేది నగరాభివృద్ధికి అత్యంత కీలకమైన అంశం. ప్రతి అభివృద్ధి పనికి ప్రభుత్వం వైపు మాత్రమే చూడకుండా, స్వంత ఆదాయ వనరులను పెంచుకోవడం, ఆస్తులను సమర్థంగా వినియోగించడం, పారదర్శక ఆర్థిక నిర్వహణ పాటించడం ఇప్పుడు ప్రతి కార్పొరేషన్‌కు అవసరంగా మారింది. ఈ విషయంలో కొత్త కార్పొరేషన్లు చూపుతున్న ఆర్థిక క్రమశిక్షణ ఇతర స్థానిక సంస్థలకు కూడా ఆదర్శంగా నిలవవచ్చు.అదే సమయంలో జీహెచ్ఎంసీ ఆర్థిక పునరుద్ధరణకు ప్రత్యేక కార్యాచరణ అవసరం. రుణాల పునర్వ్యవస్థీకరణ, ప్రభుత్వ బకాయిల వేగవంతమైన చెల్లింపులు, కొత్త ఆదాయ వనరుల అన్వేషణ, వినియోగంలో లేని ఆస్తుల ద్వారా ఆదాయం పెంపు, మున్సిపల్ బాండ్ల వినియోగం వంటి అంశాలపై సమగ్ర వ్యూహం అమలు చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే అప్పుల చెల్లింపులకే పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించాల్సి రావడంతో అభివృద్ధి పనులపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.మొత్తం మీద తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని మూడు కార్పొరేషన్ల ఆర్థిక చిత్రణ స్థానిక సంస్థలకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. సమర్థవంతమైన ఆదాయ నిర్వహణ ఉంటే కొత్త సంస్థలు కూడా మిగులు బడ్జెట్‌తో ముందుకు సాగగలవని సీఎంసీ, ఎంఎంసీ నిరూపిస్తున్నాయి. అదే సమయంలో ఆర్థిక క్రమశిక్షణ లేకుండా భారీ రుణాలపై ఆధారపడితే ఒకప్పుడు సంపన్నంగా ఉన్న సంస్థ కూడా అప్పుల భారంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని జీహెచ్ఎంసీ పరిస్థితి చెబుతోంది. భవిష్యత్తులో తెలంగాణ పట్టణాభివృద్ధి విజయవంతం కావాలంటే అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు బలమైన ఆర్థిక నిర్వహణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిందే.




# ఓటర్ల సాధకబాధకాలేంటి..?

తెలుగు రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ మొదలుకాక ముందు నుంచే రాజకీయ పార్టీలు అభ్యంతరాలు చెబుతున్నాయి. కానీ సర్ మొదలయ్యాక సాధారణ ఓటర్లను కూడా సవాలక్ష సందేహాలు ముసురుకుంటున్నాయి. సర్ విషయంలో ఈసీ చెప్పినదానికీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్నదానికీ పొంతన కుదరడం లేదు. బీఎల్వోల అవగాహన రాహిత్యం మరింత గందరగోళానికి దారితీస్తోంది. దీనికి తోడు ఎప్పుడో 2002 నాటి ఓటర్ల జాబితా వివరాలు అడగటం.. పెద్ద బ్రహ్మపదార్థంగా మారింది. ఇక ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ ఫారాలు నింపడం మరింత పెద్ద ప్రహసనంగా తయారైంది. ప్రస్తుత పరిస్థితుల్లో అనుకున్న గడువు లోగా సర్ పూర్తవుతుందా.. లేదా అని పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. సర్ నడుస్తున్న తీరుపై ఈసీ ఓ రకమైన లెక్కలు చెబుతుంటే.. అసలు అంత సీన్ లేదనేది పార్టీలు చెబుతున్న మాట. ఈసీ, పార్టీల మధ్య జరుగుతున్న పంచాయితీ తర్వాత.. మధ్యలో తమ ఓట్లు ఏమౌతాయోననేది ఓటర్లకు అంతుచిక్కడం లేదు.సర్ ప్రక్రియ మొదలుకాకముందు.. నిరక్షరాస్యులకు ఇబ్బంది అవుతుందేమోననే అనుమానాలు వచ్చాయి. కానీ తీరా ఎన్యూమరేషన్ ఫారాలు చేతికి వచ్చాక.. అక్షరాస్యులకూ తలబొప్పి కడుతోంది. దీనికి తోడు బీఎల్వోలు కూడా ఫారాలు నింపే విషయంలో చేతులెత్తేయడం.. సమస్యను మరింత పెద్దది చేస్తోంది. దేశంలో ఓటర్ల జాబితాను అప్పుడప్పుడూ సవరించడం తప్పనిసరి. అర్హులకు చోటు కల్పించి అనర్హులపై వేటు వేసేందుకు సర్ నిర్వహించడమూ అవసరమే. దీని పై ఎవరికీ ఎలాంటి అభ్యంతరం లేదు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి ప్రజాప్రాతినిధ్య చట్టం -1951 పూర్తి స్వేచ్ఛను కల్పించింది. ఈసీ ఈ విషయం లో ఎవరి అనుమతి తీసుకోవాల్సిన లేదా ఎవరికీ జవాబుదారీ వహించాల్సిన అవసరం లేదు. దేశంలో ఇలాంటివి జరగడం ఇదే కొత్త కూడా కాదు. 1952 నుంచి 2004 వరకు 13 సార్లు సర్ జరిగింది. కానీ, ప్రస్తుత సర్వే స్థాయిలో అవేవీ వివాదాల్లో చిక్కుకోలేదు.గతంలో 2002-03లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ.. సర్ కార్యక్రమం ఎలాంటి హడావుడి లేకుండా జరిగిపోయింది. కానీ ఇప్పుడు నిర్వహిస్తున్న సర్ మాత్రం బాగా చర్చనీయాంశవవుతోంది. ప్రస్తుత ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ పత్రంలో ప్రతి ఓటరు వ్యక్తిగత వివరాలను నింపాలి. పుట్టిన తేదీని, ఆధార్ కార్డు సంఖ్యను, తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి పేర్లను, ఓటరు కార్డు గుర్తింపు సంఖ్య ఉంటే దానినీ ఇవ్వాలి. అంతవరకు బాగానే ఉంది. ఎస్ఐఆర్ పత్రంలో రెండో భాగంతోనే పేచీ వస్తోంది. అందులో ప్రతి ఓటరు తమ కుటుంబం గత 23 ఏళ్లుగా భారతదేశంలోనే నివసిస్తున్నట్లు ధ్రువీకరించే వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది. ఓటర్లు ఈ దేశ పౌరులేనని నిర్ధారించడానికి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణమిది. ఈ వివరాలను ఇవ్వనివారి పేర్లను ఓటరు జాబితాల నుంచి కొట్టేసే ప్రమాదం ఉంది. అయితే ఈ మాటను అధికారికంగా బయటకు చెప్పకపోవడం వేరే సంగతి. పైగా 2002 ఓటర్ల జాబితాలో వివరాలు అడగటంతో.. ఓటర్లు షాక్ అవుతున్నారు. ఆ సమయంలో ఓట్లు లేని వారి బాధ ఒకలా ఉంటే.. ఉన్నా సరే వివరాలు గుర్తులేని వారి కష్టం మరోలా ఉంది. 2002 ఓటర్ల జాబితాలో వివరాలు సరిచూడాల్సిన బాధ్యత బీఎల్వోలదేనని ఈసీ చెప్పినా.. వారు మాత్రం ఓటర్ల దగ్గరున్న వివరాలుంటే ఓకే.. లేదంటే మీ ఖర్మ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆనాటి ఓటర్ల జాబితా కోసం నానాపాట్లు పడుతున్న ఓటర్లు వివరాలు తెలిస్తే.. ఎవరెస్ట్ ఎక్కినంత ఆనందపడుతున్నారు. ఎంత ప్రయత్నించినా వివరాలు తెలియనివారు.. తమ సంగతేంటోనని మథనపడుతున్నారు.అసలు విషయం ఏమిటంటే 24 ఏళ్ల క్రితం నాటికీ, ఇప్పటికీ నియోజకవర్గాలు, పోలింగ్ బూతులు చాలా వరకు మారిపోయాయి. అప్పట్లో ఓటేసిన చాలామందికి అప్పటి పోలింగ్ కేంద్రం గుర్తులేదు. అలా లేకపోతే తామేం చేయలేమని కొందరు బీఎల్వోలు భయపెడుతున్నారు. మరికొందరైతే అప్పటి ఓటర్ ఐడీ ఇస్తేనే పనౌతుందని అదరగొడుతున్నారు. కొన్నిచోట్ల బీఎల్యేలు జోక్యం చేసుకుని.. సమస్య పరిష్కరిస్తున్నా.. చాలాచోట్ల ఓటర్ల పరిస్థితి పద్మవ్యూహంలో అభిమన్యుడిని తలపిస్తోంది. ఏదో వివరాలు అడుగుతారు అనుకున్నాం కానీ.. ఇదేం సర్ పరీక్ష అని ఓటర్లు తలలు పట్టుకుంటున్నారు. పేరుకి సర్ హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుచేసినా.. అవెలా పనిచేస్తాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అసలు ఎన్యుమరేషన్ ఫారాలు నింపడంలో కూడా సహకరించాల్సిన బీఎల్వోలు.. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీనే గొప్ప అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది ఓటర్లకు నేరుగా ఫోన్ చేసి.. తమ దగ్గరకు వచ్చి ఫారాలు తీసుకెళ్లాలని దబాయిస్తున్నారు. అసలు సర్ కోసం ఈసీ పెట్టిన గడువు ఒకటైతే.. బీఎల్వోలు మరో అడుగు ముందుకేసి సొంత డెడ్‌లైన్లు పెడుతూ.. ఓటర్లను హడలెత్తిస్తున్నారు. అదేమంటే మేం తీసుకోవాలంటే అంతే.. కావాలంటే మీరు ఆఫీసులకు వెళ్లి ఇచ్చుకోండి అని దురుసుగా సమాధానం చెబుతున్నారు. ఇప్పటికే ఎన్యుమరేషన్ ఫారాన్ని బూచిగా చూస్తున్న ఓటర్లు.. బీఎల్వోలతో ఎందుకొచ్చిన తంటా అని పనులు మానుకుని మరీ వారి చుట్టూ తిరగాల్సి వస్తోంది.సర్ విషయంలో ఈసీకి సహకరించాలనుకున్న ఓటర్లకు.. బీఎల్వోలు అగ్నిపరీక్షలు పెడుతున్నారు. ఈసీ చెప్పింది కొంతైతే.. దానికి సొంత పైత్యం జోడించి తారెత్తిస్తున్నారు. చాలా మంది బీఎల్వోలకు ఎన్యుమరేషన్ ఫారాలు నింపడంపై కనీస అవగాహన లేకపోవడం.. ఈసీ అసలు ఉద్దేశాన్ని దెబ్బతీసే ప్రమాదం కనిపిస్తోంది. ఈ విషయంలో పార్టీల అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోవాలని ఓటర్ల నుంచి కూడా డిమాండ్ వస్తోంది. ఓవైపు అధికారులు బీఎల్వోకు ట్రైనింగ్ ఇచ్చామని చెబుతున్నా.. ఎన్యుమరేషన్ ఫారాలిచ్చే వారిలో చాలామంది నింపడం తమతో కాదని.. మీ తిప్పలు మీరే పడాలని ముందే చెప్పేస్తున్నారు. దీంతో ఎవర్ని అడగాలో తెలియక సాధారణ ఓటర్లు తికమక పడుతున్నారు. కొంత అవగాహన ఉన్నవారు కూడా ఎన్యుమరేషన్ ఫారం ఎలా నింపితే ఏమౌతుందోనని కంగారు పడుతున్నారు. అంతకుముందు ఎన్యుమరేషన్ ఫారాలు నింపిచ్చాక.. అధికారులు ఇచ్చే నోటీసుల్లో ఏం కొర్రీలు పెడతారోననే అనుమానాలు మాత్రమే ఉన్నాయి. కానీ ఇప్పుడు అసలు ఎన్యుమరేషన్ ఫారం నింపి ఇవ్వడమే పెద్ద ప్రహసనంగా మారుతోంది. దీంతో చాలా మంది ఓటర్లు సర్ ప్రక్రియ తమ చావు కొచ్చిందని నిట్టూరుస్తున్నారు.సర్ దరఖాస్తు పత్రం దిగువ భాగంలో 2002నాటి ఎస్ఐఆర్ పత్రంలో ప్రచురితమైన ఓటరు వ్యక్తిగత వివరాలను కానీ, అతడు లేదా ఆమె తాతతండ్రుల పేర్లను కానీ ఇవ్వాలి. 2002నాటి ఓటరు జాబితాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉంచారు. ఏ ఓటరుకైనా 2002 జాబితాలోని తన అసెంబ్లీ నియోజకవర్గం కానీ, పోలింగ్ బూత్ కానీ స్పష్టంగా తెలియకపోతే చిక్కులో పడినట్లే. తల్లిదండ్రులు, తాతనాయనమ్మల పేర్లను వెబ్‌సైట్‌లో వెతకడం కష్టం. ఓటరు దీర్ఘకాలంగా ఒకేచోట నివసిస్తున్నా, నియోజక వర్గం, పోలింగ్ కేంద్రం మారిపోయి ఉండవచ్చు.సర్ ఫారం ఎగువన బీఎల్‌వోల ఫోన్ నంబర్లు ఇవ్వడం కొంత నయమని చెప్పాలి. అయితే, ఓటరు వారికి ఫోన్ చేసి బూత్ గురించి తెలుసుకోవాలనుకున్నా, ఆ సమయంలో బీఎల్‌వోలు వేరే పనుల్లో ఉండి ఫోన్ ఎత్తలేకపోవచ్చు. అంతకన్నా పై అధికారుల పరిస్థితి కూడా అలాగే ఉండవచ్చు. కొంతమంది బీఎల్‌వోలు, ముఖ్యంగా గ్రామాల్లోని వారు సర్ పత్రంలో మొదటి భాగాన్ని నింపి ఇచ్చేయాలని ఓటర్లకు సూచిస్తున్నారు. రెండో భాగంలోని వివరాలను వారే భర్తీ చేస్తున్నారు. ఒకవేళ బీఎల్‌వోలు ఫారం దిగువ భాగాన్ని నింపలేకపోతే పత్రం సగం ఖాళీగా మిగిలిపోతుంది. ఖాళీ పత్రాలను సమర్పించిన తరవాత ఓటరుకు 2002నాటి వివరాలు, ముఖ్యంగా తాతతండ్రుల వివరాలు తెలిసివస్తే, వాటిని స్వీకరించడానికి తమకు అధికారం లేదంటూ బీఎల్‌వోలు నిరాకరిస్తున్నారు. గడువులోగా పని పూర్తిచేయాలని పైవాళ్ల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక కొందరు బీఎల్‌వోలు తమకు తోచిన వివరాలతో ఫారాలను నింపేస్తున్నారు. ఇలాంటి ఓటర్ల పేర్లు గడువు తేదీకల్లా ప్రచురితమయ్యే తొలి జాబితాలో లేకపోతే, కొత్త ఓటరుగా రిజిస్టరు కావడానికి ఆరో నంబర్ ఫారాన్ని సమర్పించాల్సి వస్తుంది. కొంతమంది ఓటర్ల పేర్లు, వారి తాతతండ్రుల పేర్లు 2002 ఓటర్ల జాబితాలో ఉన్నప్పటికీ ప్రస్తుత జాబితాలలో లేకపోవడంతో ఎస్ఐఆర్ ఫారాన్ని పొందలేకపోతున్నారు. వీరి పేర్లను ఉద్దేశపూర్వకంగా కానీ, కాకతాళీయంగా కానీ జాబితా నుంచి తొలగించి ఉండవచ్చు. ఇలాంటివారు కూడా కొత్త ఓటర్లుగా ఆరో నంబర్ ఫారాన్ని సమర్పించాల్సి వస్తోంది.సర్ విషయంలో ఈసీకి సదుద్దేశాలున్నా.. క్షేత్రస్థాయికి వచ్చేసరికి అది నానారకాలుగా భ్రష్టు పడుతోంది. అలా జరగకుండా ఇప్పటికైనా అధికారులు జాగ్రత్తపడాలి. ఏదోలా ఓటర్ల నుంచి సమాచారం తీసుకోవాలే కానీ.. వారిని అదరగొట్టి.. బెదరగొడితే మొదటికే మోసం వస్తుందన్న సంగతి మర్చిపోకూడదు. మొత్తం మీద సర్ విషయంలో నిర్దిష్టంగా సమాచారం అందిస్తూ ప్రజల భయాందోళనలను ఉపశమింపజేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలి. లేకపోతే పెద్ద సంఖ్యలో ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని రాజకీయ పార్టీలు మొత్తుకుంటున్నాయి. కేవలం తమ అభ్యంతరాలను గుడ్డిగా నమ్మాల్సిన పని లేదని.. ఏ నియోజకవర్గంలో, ఏ పోలింగ్ బూత్ లో పారదర్శకంగా విచారణ చేసినా.. అసలు ఓటర్ల కష్టాలేంటో ఈసీకి తెలుస్తాయని బీఎల్యేలు పార్టీలకతీతంగా తేల్చిచెబుతున్నారు.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# 'ఏఐ'తో సరికొత్త విప్లవం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** క్యాన్సర్ నిర్ధారణ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సరికొత్త విప్లవానికి తెరలేపుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తన తాజా నివేదికలో వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా నిపుణలైన రేడియాలజిస్టులు, పాథాలజిస్టుల కొరత తీవ్రంగా వేధిస్తున్న తరుణంలో ఏఐ ఆధారిత ఇమేజింగ్, డిజిటల్ పాథాలజీ వ్యవస్థలు వ్యాధిని ప్రాథమిక దశలోనే అత్యంత ఖచ్చితత్వంతో గుర్తిస్తున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. క్లినికల్ ట్రయల్స్‌లో మానవ తప్పిదాలను తగ్గించడంలో ఈ సరికొత్త డిజిటల్ మెడిసిన్ అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని శాస్త్రవేత్తలు నిరూపించారు.

**ఏఐతో సులభతరం..**

సాధారణంగా ప్రారంభ దశలో ఉండే క్యాన్సర్ కణాల సూక్ష్మ మార్పులను సాధారణ ఎక్స్-రేలు లేదా స్కానింగులలో గుర్తించడం వైద్యులకు కూడా కొన్నిసార్లు సవాలుగా మారుతుంది. అయితే ఏఐ అల్గారిథమ్స్ ఈ క్లిష్టమైన ప్రక్రియను ఎంతో సులభతరం చేస్తున్నాయి. బయాప్సీ చేసిన కణజాలాలను విశ్లేషించే డిజిటల్ పాథాలజీలో ఏఐ దాదాపు 96.3 శాతం సున్నితత్వంతో, 93.3 శాతం ఖచ్చితత్వంతో క్యాన్సర్ ఉనికిని గుర్తిస్తోంది. అలాగే పురుషులలో వచ్చే ప్రొస్టేట్ క్యాన్సర్ నిర్ధారణలో ఉపయోగించే హిస్టోలాజిక్ అనాలిసిస్‌లో డీప్ లెర్నింగ్ మోడల్స్ 99 శాతం అత్యుత్తమ ఫలితాలను సాధించాయి. గర్భాశయ ముఖద్వార (సర్వికల్) క్యాన్సర్‌కు సంబంధించిన పాథాలజీ పరీక్షల్లో సాధారణ కణాలకు, క్యాన్సర్ కణాలకు మధ్య ఉన్న తేడాలను ఏఐ 92 నుంచి 98 శాతం ఖచ్చితత్వంతో వేరు చేసి చూపిస్తోంది. మమ్మోగ్రఫీ స్క్రీనింగ్, ఊపిరితిత్తుల ఇమేజింగ్ పరీక్షల్లో ఏఐ వ్యవస్థలను ఉపయోగించడం వల్ల క్యాన్సర్ ముదిరిపోయే లోపే గుర్తించే రేటు పెరిగినట్టు అంతర్జాతీయ క్లినికల్ ట్రయల్స్ స్పష్టం చేస్తున్నాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ ఇమేజింగ్‌లో చిన్న చిన్న గడ్డలను గుర్తించడంలో ఏఐ మోడల్స్ 86 నుంచి 87 శాతం విజయవంతమయ్యాయి. రొమ్ము క్యాన్సర్ నిర్ధారణలో రేడియాలజిస్టుల పనిభారాన్ని తగ్గించడంతో పాటు, తప్పుడు రిపోర్టులు వచ్చే అవకాశాలను ఏఐ గణనీయంగా నివారిస్తోందని నివేదిక పేర్కొంది.

**నిధుల కొరత..**

ఈ సరికొత్త ఏఐ సాంకేతికతలు కేవలం నగరాలు, పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా, వైద్య సదుపాయాలు లేని గ్రామీణ ప్రాంతాలకు, పేద దేశాలకు చేరాల్సిన అవసరం ఉందని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంటోంది. పోర్టబుల్ ఏఐ పరికరాల ద్వారా తక్కువ ఖర్చుతోనే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, వీటికి సరైన క్లినికల్ వాలిడేషన్, ప్రభుత్వాల నియంత్రణ అనుమతులు, నిధుల కొరత ప్రధాన అడ్డంకులుగా మారాయి. ఈ డిజిటల్ ఆవిష్కరణలను ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలలో భాగం చేసినప్పుడే, ప్రపంచవ్యాప్తంగా వైద్యుల కొరతను అధిగమించి, లక్షలాది మంది సామాన్య రోగులకు సకాలంలో ప్రాణదానం చేయవచ్చని నివేదిక తేల్చి చెప్పింది.దేశంలో క్యాన్సర్ కారణంగా ప్రతి సంవత్సరం దేశ జీడీపీలో సుమారు 1 శాతం వరకు ఆర్థిక నష్టం సంభవిస్తోంది. దేశంలో దాదాపు 40 శాతం క్యాన్సర్ కేసులు అత్యంత ఆలస్య దశలోనే గుర్తించబడుతున్నాయి. ఫలితంగా చికిత్స క్లిష్టంగా మారుతోంది. ప్రస్తుతం అమలులో ఉన్న కొన్ని క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాల్లో అవసరం లేని నిర్ధారణలు కూడా జరుగుతున్నాయి. పైగా చిన్నపిల్లల క్యాన్సర్లు, పెద్దపేగు (కొలన్) క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించే స్క్రీనింగ్ వ్యవస్థలు ఇంకా బలహీనంగానే ఉన్నాయి. వీటికి తోడు క్యాన్సర్ నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. పెట్ స్కానర్లు, రేడియోథెరపీ సౌకర్యాల లభ్యత ప్రపంచంలోనే అత్యల్పంగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. తీవ్రమైన ఈ అడ్డంకులను అధిగమించి క్షేత్రస్థాయిలో నాణ్యమైన సేవలు అందించాలంటే మనదేశంలో ఏఐ ఆధారిత క్యాన్సర్ గుర్తింపు, స్క్రీనింగ్, ఖచ్చితమైన నిర్ధారణ, చికిత్సా ప్రణాళికలను వైద్య వ్యవస్థలో విస్తృతంగా వినియోగించడం అత్యంత ఆవశ్యకం.



# డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్..

**అమెరికా:** ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఘాటైన హెచ్చరిక జారీ చేశారు. తనపై హత్యాయత్నం చేయడానికి ఇరాన్ ప్రయత్నిస్తే, ఆ దేశంపై క్షిపణుల వర్షం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. తాము ఇప్పటికే 1,000 క్షిపణులను సిద్ధం చేసి ఉంచామని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే వేల క్షిపణులతో భారీ ప్రతీకార దాడులు జరుగుతాయని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్' ద్వారా వెల్లడించారు.'నన్ను హత్య చేయాలని ఇరాన్ ప్రయత్నిస్తే భారీ విధ్వంసం తప్పదు. 1,000 క్షిపణులు ఇప్పటికే లక్ష్యాలను గురిపెట్టి సిద్ధంగా ఉన్నాయి. అంతటితోనే ఆగదు. అవసరమైతే మరిన్ని దాడులు జరుగుతాయి. ఇప్పటికే ఈ విషయమై సైన్యానికి ఆదేశాలు అందాయి. ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలను ధ్వంసం చేయడానికి అమెరికా సైన్యం సిద్ధంగా ఉంది' అని ట్రంప్ హెచ్చరించారు.తనపై ఇరాన్ హత్యాయత్నం చేసే అవకాశం ఉందని గతంలో కూడా ట్రంప్ ఆరోపించారు. అలాంటి ప్రయత్నం జరిగితే అమెరికా ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని, ఇరాన్ కీలక సైనిక స్థావరాలపై భారీ దాడులు జరుగుతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటికే హోర్ముజ్ జలసంధి, అణు ఒప్పందం వంటి అంశాలపై ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ఈ హెచ్చరికలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసే అవకాశం కనబడుతోంది.

# తెలంగాణలో 'రైతు బీమా' కనుమరుగు..!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** అన్నదాతలకు కొండంత అండగా నిలుస్తున్న రైతుబీమా పథకం కనుమరుగవుతుందనే ప్రచారం జరుగుతోంది. కొత్తగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రభుత్వం అమలు చేసేందుకు ప్లాన్‌చేస్తోంది. నవంబర్19న ఇందిరా గాంధీ జయంతి రోజున పథకానికి శ్రీకారం చుట్టనుండగా ఇప్పటికే పథకానికి సంబంధించిన విధి విధానాలు సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. 2018లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఏటా 25 వేల కుటుంబాలకు పరిహారం అందుతుంది. రైతులపై భారం పడకుండా ప్రభుత్వం ప్రీమియం ఏటా ఆగస్టు 14న చెల్లిస్తోంది. పథకం ప్రారంభంలో 31.25 లక్షల మంది అర్హులు ఉండగా ప్రస్తుత ఏడాదిలో 42.16 లక్షల మందికి వర్తిస్తోంది. అయితే ఈ పథకంలో ఏటా కొత్తగా చేరే రైతులకంటే అనర్హుల తొలగింపు, మరణించే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఏటా 59 ఏళ్లుపైబడిన రైతులు పథకానికి దూరవవుతుండగా భూమి పంపకాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఇక రైతు ఆకస్మాత్తుగా మరణిస్తే కుటుంబానికి రూ.5 లక్షల బీమాను కేసీఆర్ అమలు చేయగా ఈ పథకం రద్దు చేయకుండా పాత పద్ధతిలోనే కొనసాగించాలని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం ఏటా బీమా కోసం చెల్లిస్తున్న ప్రీమియంలో 70 శాతం చెల్లింపుకు సరిపోగా 30 శాతం మిగులుతుంది.

**ఇందిరమ్మ బీమా..**

రాష్ట్రం ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించేందుకు కసరత్తు వేగవంతం చేసింది. వివిధ కారణాలతో కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించనుంది. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు కుటుంబ జీవిత బీమా అమలు చేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. దీనికోసం బడ్జెట్‌లో రూ.4వేల కోట్లు కూడా కేటాయించారు. ఇందిరమ్మ బీమా పథకం కుటుంబంలో కేవలం ఒక్కరికే వర్తిస్తోంది. అది కూడా కుటుంబ పెద్దకు మాత్రమే వర్తించేలా ఈ పథకాన్ని రూపొందిస్తున్నట్టు, రేషన్‌కార్డు కలిగిన వారికి మాత్రమే అమలు చేయనున్నట్టు తెలిసింది. రైతుబీమా పథకం కుటుంబంలో భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఇందిరమ్మ బీమా పథకం మాత్రం కుటుంబంలో ఒక్కరికే వర్తించనుంది. ఇందిరమ్మ బీమా అమలు చేస్తే ఎంతమందికి పరిహారం అందుతుందనేది మాత్రం ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే మారింది.

**ఆగస్టు 14తో లాస్ట్..**

ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రారంభించే ఇందిరమ్మ బీమా నవంబర్19 ప్రారంభిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. రైతు బీమా గడువు ఆగస్టు 14తో ముగియనుంది. ఈరెండు పథకాల మధ్య నాలుగు నెలల వ్యవధి ఉంటుంది. ఈమధ్య కాలంలో మరణించిన రైతులకు పరిహారం పరిస్థితి ఏమిటనే విషయం ఆందోళన కలిగిస్తోంది. అప్పటివరకు ప్రభుత్వం రైతు బీమా పథకం ప్రీమియం చెల్లిస్తుందా? పథకం పక్కకు పెడుతుందా? అనే అంశంపై ప్రభుత్వ వర్గాల్లో క్లారిటీ లేదు. ఇప్పటివరకు ఏటా సుమారు 18 వేల నుంచి 25 వేల మంది రైతు కుటుంబాలకు బీమా పరిహారం అందేది. ఈ నాలుగు నెలల పాటు బీమా పథకం అందకుంటే ఎన్నో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటాయి. రేవంత్ ప్రభుత్వం నాలుగు నెలలకు సంబంధించిన ప్రీమియం చెల్లించాలని రైతులు సంఘాలు సూచనలు చేస్తున్నాయి. అన్నదాతకు ఎంతో ఆసరాగా నిలిచే పథకం రద్దుపై పాలకులు ఆలోచించాలని రైతులు కోరుతున్నారు.

# విజయవంతంగా సుంకిరెడ్డి మెగా ఉచిత కంటి వైద్య శిబిరం






**తలకొండపల్లి,,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

రంగారెడ్డి జిల్లా తలకొండ పల్లి మండల కేంద్రంలో దేవకి ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరం ద్వారా గ్రామీణ వర్గాల ప్రజలకు కంటి వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలనే లక్ష్యంతో. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి. సహకారంతో ప్రముఖ కంటి వైద్య నిపుణులు శంకర నేత్రాలయ చెన్నై వారిచే తలకొండపల్లిలోని శ్రీ దేవకి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ప్రజల విశేష ఆదరణతో విజయవంతంగా కొనసాగింది, ఈ శిబిరంలో వేలాది మంది ప్రజలు ఉచిత కంటి పరీక్షలు చేయించుకోగా,అర్హులైన వారికి ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు,అలాగే కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్న వారికి పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించి, మందులు, తదుపరి వైద్య సేవలను కూడా అందిస్తున్నారు,ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ. ఈ శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్క ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు, ప్రజల విశ్వాసమే నాకు సేవ చేయడానికి మరింత ప్రేరణను ఇస్తోంది, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరూ వైద్యానికి దూరం కాకూడదనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం, ఒక వ్యక్తికి కంటిచూపు రావడం అంటే ఒక కుటుంబంలో ఆనందాన్ని నింపినట్టే, భవిష్యత్తులో కూడా ఐక్యత ఫౌండేషన్ ద్వారా ఆరోగ్యం, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తాం అని తెలిపారు,ఈ శిబిరంలో 191మంది కంటి శుక్లాల పేషెంట్లను సర్జరీలకు ఎంపిక చేయగా,వారిలో 38 మంది పేషెంట్లు సర్జరీల ప్రక్రియకు హాజరుకాలేక పోయారు,సర్జరీలకు హాజరైన 153 మందికి విజయవంతంగా సర్జరీలు పూర్తి చేయడం జరిగిందని,మండలంలోని అన్ని గ్రామాల నుండి శిబిరానికి విచ్చేసి సేవల్ని వినియోగించుకొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు,

**కంటి వైద్య శిబిరాన్ని సందర్శించిన పలువురు సర్పంచులు**

అనంతరం శిబిరానికి విచ్చేసిన పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు,గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యున్నత వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించడం అభినందనీయం, వేలాది మంది ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవడం ఆయనపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనం,ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరం,భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నాం." అని ,ఇంత గొప్ప కార్యక్రమాలతో పేద ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి భవిష్యత్ లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో.సర్పంచ్ లు సుధాకర్,రామకృష్ణ, రమేష్,శ్రీను నాయక్,దాస్ నాయక్,రమేష్ నాయక్,కళ్యాణ్ నాయక్,ఉప సర్పంచ్ లు రమేష్ యాదవ్,ఆంజనేయులు, కుమార్,మాజీ ఎంపిపి పంతు నాయక్,మాజీ సర్పంచ్ లు నరేందర్ గౌడ్,రఘుపతి,శంకర్,వార్డు సభ్యులు భాస్కర్,జగన్, దస్రు,సీనియర్ నాయకులు మోహన్ నాయక్,పకీర,శ్రీను నాయక్,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు, శంకర నేత్రాలయ వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.



# వికసిత్ భారత్-2047 లక్ష్యం




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఇండస్ట్రీ లీడర్ టౌన్ హాల్' సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, బుల్లెట్ ట్రైన్, రైల్వే ఆధునికీకరణ వంటి రంగాల్లో జరుగుతున్న మార్పులను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమలో దాదాపు 10 లక్షల మంది నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరత ఉందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ అవకాశాన్ని భారత్ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశానికి ఎలక్ట్రానిక్స్, ఐటీ, చిప్ డిజైన్ రంగాల్లో ఇప్పటికే బలమైన పునాది ఉందని చెప్పారు.విద్యార్థులకు సెమీకండక్టర్ డిజైన్‌లో ప్రోత్సాహం అందించేందుకు సైనాప్సిస్, క్యాడెన్స్ వంటి అత్యాధునిక జుణూ టూల్స్‌ను 315 విశ్వవిద్యాలయాలకు ఉచితంగా అందించినట్లు వెల్లడించారు. విద్యార్థులు స్వయంగా చిప్‌లను డిజైన్ చేసి, మొహాలీలోని సెమీకండక్టర్ ల్యాబ్‌లో వాటిని తయారు చేసి పరీక్షించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రపంచంలో చాలా కొద్ది విశ్వవిద్యాలయాలకే ఇలాంటి సదుపాయాలు ఉన్నాయని అన్నారు.దేశంలోని ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం రెండంకెల వృద్ధిరేటుతో దూసుకెళ్తోందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం ఈ పరిశ్రమ విలువ రూ.13 లక్షల కోట్లకు చేరుకుందని, త్వరలోనే రూ.20 లక్షల కోట్లకు పెరుగుతుందని చెప్పారు. ఈ రంగం ద్వారా ఇప్పటికే 25 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని వెల్లడించారు. ఈ మధ్య భారత్ నుంచి అత్యధికంగా ఎగుమతి అయ్యే వస్తువుల్లో మొబైల్ ఫోన్లు అగ్రస్థానంలో నిలిచాయని, ఒకప్పుడు పెట్రోలియం, జెమ్స్ అండ్ జ్యువెలరీ ఆధిపత్యం ఉన్నా ఇప్పుడు ఎలక్ట్రానిక్స్ రంగం వాటిని అధిగమించిందని తెలిపారు.తెలంగాణలో ప్రస్తుతం 104 ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలు పనిచేస్తున్నాయని అశ్విని వైష్ణవ్ తెలిపారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 4 భారీ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను మంజూరు చేసిందని చెప్పారు. హైదరాబాద్‌లో హార్డ్‌వేర్ ప్రోటోటైప్ డిజైన్, టెస్టింగ్, వ్యాలిడేషన్ కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ముంబై-అహ్మదాబాద్ మధ్య వేగంగా నిర్మాణంలో ఉందని.. 2027లో తొలి దశ సేవలు ప్రారంభమవుతాయని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఇదే అనుభవంతో దేశంలో మరో ఏడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లకు ఆమోదం లభించిందని తెలిపారు.హైదరాబాద్‌ను బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుల ప్రధాన హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని పేర్కొంటూ.. నగరం నుంచి హైదరాబాద్-పుణె, హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ప్రయాణ సమయం భారీగా తగ్గుతుందని ఆయన అన్నారు. దీనివల్ల హైదరాబాద్-అమరావతి మధ్య 1 గంట 10 నిమిషాలు, హైదరాబాద్-బెంగళూరు మధ్య 2 గంటల 35 నిమిషాలు, హైదరాబాద్-చెన్నై మధ్య 3 గంటలు, హైదరాబాద్-పుణె మధ్య 2 గంటల 3 నిమిషాలు, పుణె-ముంబై మధ్య 48 నిమిషాలు మాత్రమే అని తెలిపారు.యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేవలం రూ.880 కోట్ల రైల్వే బడ్జెట్ మాత్రమే వచ్చేదని, ప్రస్తుతం తెలంగాణకే రూ.5,454 కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయిస్తున్నామని అశ్విని వైష్ణవ్ తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యాధునిక ప్రమాణాలతో పునర్నిర్మిస్తున్నామని.. నాంపల్లి, బేగంపేట, హైటెక్ సిటీ, వరంగల్, కరీంనగర్ వంటి స్టేషన్ల ఆధునికీకరణ పనులు కూడా పూర్తయ్యాయని చెప్పారు. దేశవ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్లను ఆధునికీకరించే కార్యక్రమంలో ఇప్పటికే 260కు పైగా స్టేషన్ల పనులు పూర్తయ్యాయని వెల్లడించారు.వందేభారత్ రైళ్లు ప్రపంచస్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబడ్డాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 36,000 కి.మీ. కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించామని తెలిపారు. అలాగే 2,700 కి.మీ. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌లో 99.4% విద్యుద్దీకరణ పూర్తయిందని, దీంతో డీజిల్‌పై ఆధారపడటం దాదాపు పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు.దేశంలో ప్రస్తుతం అభివృద్ధి, పనితీరు ఆధారిత రాజకీయాలే నడుస్తున్నాయని అశ్విని వైష్ణవ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్‌తోనే బుల్లెట్ ట్రైన్లు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఆధునిక రైల్వే వ్యవస్థ వంటి కీలక రంగాల్లో భారత్ ప్రపంచస్థాయికి చేరుకుంటోందని పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు.

# లాల్‌పహాడ్-చౌదరిగూడెం డబుల్ రోడ్డుకు రూ.7.50 కోట్ల మంజూరు



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన చౌదరిగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్

**షాద్ నగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** లాల్‌పహాడ్ నుంచి చౌదరిగూడెం వరకు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.7 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల చౌదరిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధిపై ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేక దృష్టి సారించడంతో లాల్‌పహాడ్-చౌదరిగూడెం డబుల్ రోడ్డుకు రూ.7.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు, వాహనదారులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా నిలుస్తుందని చెప్పారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు, ముఖ్యంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మండల కాంగ్రెస్ పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చంద్రశేఖర్ పేర్కొన్నారు. పనులను త్వరితగతిన ప్రారంభించి, నాణ్యతతో పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మేడిపల్లి డివిజన్ అధ్యక్షుడి గా తుంగతుర్తి రవి



**మేడిపల్లి,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** మేడిపల్లి 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తుంగతుర్తి రవి నియమితులైన సందర్భంగా, మేడిపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు రవిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లా డుతూ, గత కొంతకాలంగా పాత్రికేయులు తనకు అంది స్తున్న సహకారానికి కృతజ్ఞత లు తెలిపారు. తన ఎదుగుద లలో పాత్రికేయుల పాత్ర ఎంతో ఉందని, అందుకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరిం త పటిష్టం చేసేందుకు, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిని అవుతూ నిరంతరం శ్రమిస్తా నని ఆయన హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భం గా రవి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ప్రెస్ క్లబ్ టి యు డబ్ల్యు జే హెచ్- 143 సభ్యులు సోమయ్య, నాగభూషణ్ చారి, కిషోర్, నవీన్ కుమార్, రఘు, బ్రహ్మం,మల్లేష్, బుచ్చిరెడ్డి, తదిత రులు పాల్గొన్నారు




# ఓటు హక్కు కోల్పోతే సర్వం కోల్పోతాము

**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** (ఎస్ ఐ ఆర్)ప్రక్రియలో భాగంగా ఆదివారం రోజున రాంపూర్ గ్రామంలో పట్టణ ప్రాంతంలో నివసించే వారి గురించి ఎన్యూమరేషన్ ఫామ్స్ నింపడానికి గ్రామపంచాయతీ దగ్గర ప్రత్యేక కౌంటర్స్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ కోరారు. ఓటు హక్కు మన బాధ్యత మన గుర్తింపు కావున ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఎన్యూమరేషన్ ఫామ్స్ తీసుకొని రావాలని తెలిపారు. ఫామ్స్ నింపి ఇవ్వకపోతే మీ ఓటు హక్కు మీరు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు.



# విద్యార్థులను మానసికంగా దృఢంగా తయారు చేయడమే ఉపాధ్యాయుల కర్తవ్యం

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఓ.విద్యా సంపత్ కుమార్ ల పదవి విరమణ మహోత్సవం ఘనంగా శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 38 సంవత్సరాల సుదీర్ఘ అనుభవంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని ఎంతోమంది విద్యార్థులను మానసికంగా,శారీరకంగా దృఢంగా త- యారవ్వడానికి నా వంతు కృషి చేశానని,ఇప్పటికీ పాత విద్యార్థులు అంతా ఎక్కడో ఒకచోట తనను కలిసి నావల్ల వారి జీవితానికి ఎంతో దృఢమైన సంకల్పాన్ని,శక్తిని,మానసిక ధైర్యాన్ని ఇచ్చానని చెబుతుంటే ఎంతో ఆనందంగా ఉందని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఎమ్మెల్సీ కోటిరెడ్డి,ఎమ్మెల్యే బిఎల్ఆర్ లు వారి రిటైర్మెంట్ తర్వాతి జీవితాన్ని ఎంతో ఆనందంగా గడపాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మరియు సహ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



# గంజాయి విక్రయదారుల అరెస్ట్

**జగదేవపూర్,ఫ్లాష్ ఇండియా :** గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తులపై పోలీసులు దాడి చేసి 80 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా వారి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... జగదేవపూర్ గ్రామానికి చెందిన చింతకింది అజయ్ కుమార్ (20), పీర్లపల్లి గ్రామానికి చెందిన బర్రెంకల శశిధర్ (25) ఇద్దరు కలిసి మహారాష్ట్రలోని నాగ్ పూర్ కు వెళ్లి గుర్తు తెలియని వ్యక్తి వద్ద రూ.10వేలతో 100 చిన్న గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేశారు. వాటిలో కొంత గంజాయిని తామే వినియోగించుకుంటూ మిగిలిన ప్యాకెట్లను జగదేవపూర్, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో ఒక్కొక్కటి రూ.500 చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో అంగీకరించారు. ఈ క్రమంలో శనివారం జగదేవపూర్ సబ్ స్టేషన్ సమీపంలో గజ్వేల్ కు చెందిన చక్రికి 10 గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్న సమ- యంలో పోలీసులు దాడి చేశారు. పోలీసులను గమనించిన గజ్వేల్ కు చెందిన చక్రి తన రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్ సైకిల్ అక్కడే వదిలి పరారయ్యాడు. అజయ్ కుమార్, శశిధర్ లను అదుపులోకి తీసుకొని గంజాయి, రెండు సెల్ ఫోన్లు, టీఎస్ 36 యం 1365 హోండా యాక్టివా, టీఎస్ 23 ఈ 1147 గల రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కుక్కునూరుపల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన రాజు, చక్రి ఇద్దరూ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, పరారీలో ఉన్న వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. గంజాయి విక్రయదారులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ లింగం, బాలకిషన్ లను గజ్వేల్ ఏసిపి నర్సింలు ప్రత్యేకంగా అభినందించారు.

# ఆర్ బి వి ఆర్ ఆర్ మహిళా కళాశాల సగర్వంగా తమ 15వ గ్రాడ్యుయేషన్ డే నిర్వాహణ










**ఎల్ బి నగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఆర్ బి వి ఆర్ ఆర్ మహిళా కళాశాల తన 15వ గ్రాడ్యుయేషన్ డేని జరుపుకుంది, 2024-2025 బ్యాచ్‌కి చెందిన 302 మంది విద్యార్థులను గ్రాడ్యుయేట్ డిగ్రీలతో సత్కరించింది. తెలంగాణలోని మహిళలకు నాణ్యమైన మరియు సరసమైన విద్యను అందించాలనే దృక్పథంతో 1954లో రాజా బహదూర్ వెంకట రామారెడ్డిచే స్థాపించబడిన ఈ కళాశాల విద్యాపరమైన నైపుణ్యం యొక్క వారసత్వాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఎన్ ఏ ఏ సి ఐదవ అక్రిడిటేషన్ సైకిల్‌లో 'ఏ' గ్రేడ్‌ని సంపాదించిన ఈ సంస్థ తెలంగాణలో మొదటిది మరియు రెండవ దేశంగా నిలుస్తుంది. ఇటీవల, నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ యొక్క 150-300 బ్యాండ్‌లో స్థానం సంపాదించుకుంది, ఇది ఉన్నత విద్యలో దాని పెరుగుతున్న స్థాయిని ప్రతిబింబిస్తుంది. ముఖ్య అతిథి శ్రీమతి. హైదరాబాద్‌లోని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి గ్రాడ్యుయేషన్ డే ఉపన్యాసం చేశారు. పల్లెటూరి విద్యార్థి నుంచి సిటీలో ఆఫీసర్‌గా ఎదిగే వరకు తన ప్రయాణాన్ని పంచుకుంటూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపింది. యువతులు సానుభూతితో పాటు దేశ ప్రజలతో నిజమైన అనుబంధాన్ని కలిగి ఉన్న నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని శ్రీమతి సుమతి కోరారు. ఆర్‌బివిఆర్‌ఆర్ మహిళా కళాశాల మహిళా విద్యకు సుదీర్ఘకాలం పాటు సేవలందిస్తున్నందుకు మరియు తెలంగాణలోని మహిళల విద్యా మరియు వ్యక్తిగత ఎదుగుదలకు ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నందుకు ఆమె ప్రశంసించారు. గౌరవ అతిథి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె. శశికాంత్ విద్యార్థుల భవిష్యత్తు ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. అచ్యుతాదేవి గ్రాడ్యుయేట్‌లను అభినందించారు మరియు వారి కృషి మరియు అంకితభావాన్ని కొనియాడారు. సెక్రటరీ మరియు కరస్పాండెంట్ ప్రొఫెసర్ కె. సుదర్శన్ రెడ్డి మరియు హైదరాబాద్ మహిళా విద్యా సంఘం (హెచ్‌ఎంవిఎస్) కార్యదర్శి ప్రొఫెసర్ కె ముత్యం రెడ్డితో పాటు అధ్యాపక బృందంలోని ముఖ్య సభ్యులు కాన్వకేషన్‌ను సత్కరించారు. హ్యూమానిటీస్, సైన్సెస్, కంప్యూటర్స్, కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ వంటి వివిధ రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్ ప్రదానం చేశారు. పరీక్షల నియంత్రణాధికారి శ్రీమతి బి. మంజుల, గ్రాడ్యుయేట్‌లు తదుపరి విద్యను అభ్యసించడంలో మరియు విజయవంతమైన వృత్తిని కొనసాగించడంలో తమ డిగ్రీలను సద్వినియోగం చేసుకుంటారని విశ్వసిస్తూ వారిపై తనకున్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉత్తరీయాలు (స్టోల్స్) ధరించారు మరియు పూర్వ విద్యార్థులు సెల్ఫీ బూత్‌ల వద్ద మెమరీ లేన్‌లో విహారయాత్ర చేశారు, పాత స్నేహితులతో మళ్లీ కనెక్ట్ అయ్యారు. ఈ కార్యక్రమం పూర్వ విద్యార్థులతో బలమైన సంబంధాలను ఏర్పరచుకునే అవకాశాన్ని అందించింది మరియు పూర్వ విద్యార్థుల కమిటీలో భాగమవ్వడానికి గ్రాడ్యుయేట్‌లను ఆహ్వానించింది. డాక్టర్ ఎం సుచిత్ర మరియు డాక్టర్ కె స్వప్న నేతృత్వంలోని కాన్వొకేషన్ కమిటీ, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు మరియు పరీక్షా శాఖలోని ఇతర సిబ్బంది నుండి బలమైన మద్దతుతో ఒక చిరస్మరణీయ వేడుకను నిర్వహించింది.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి



**మేడ్చల్,ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** ఎన్యుమరేషన్ ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవగాహన కల్పించడంతోపాటు ప్రత్యేక సమగ్ర సమరణ సర్ ప్రక్రియను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి పర్యవేక్షించారు. శనివారం కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీ నగర్ వార్డు కార్యాలయంలో నిర్వహిస్తున్న "సర్" ప్రక్రియను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ బిఎల్ఓ లు ఫారాల పంపిణీ కార్యక్రమం సజావుగా జరుగుచున్నదా, ఓటర్లు నింపిన ఫారాలను తిరిగి తీసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. ఫారాల ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫారాలను ఏ విధంగా డిజిటలైజ్ చేస్తున్నారని, డిజిటలైజేషన్ ప్రక్రియను ఆపరేటర్ల తో జాగ్రత్తగా చేయించాలన్నారు. బి ఎల్ వో లు ఓటర్ల నుండి తీసుకున్న ఫారాలను వెంటవెంటనే డిజిటలైజేషన్ చేయించాలని ఆదేశించారు. అదే ప్రాంతంలోని అపార్ట్మెంట్ల లో బిఎల్వోలు నిర్వహిస్తున్న ఫారాల అప్లోడింగ్, పూరించిన ఫారాలను తీసుకునే ప్రక్రియను సీఈవో పర్యవేక్షించారు. ఓటర్ల ఫారాలు పూరించడంలో వారికి అవగాహన కల్పిస్తూ అవసరమైన సహాయ సహకారాలను అందించాలని తెలిపారు. అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ల ద్వారా వివరాలు సేకరించి వారికి ఫారాలను అందించాలని ఆదేశించారు. బి ఎల్ వో లకు కేటాయించిన ప్రాంతాలలో అందుబాటులో లేని వారి వివరాలను సూపర్వైజర్లకు తెలియజేయాలని సూచించారు. 2002లో లేని వారి ఫారాలు ఏ విధంగా పూరించాలి అనే అంశంపై సీఈవో వివరించారు. అనంతరం కెపిహెచ్బి 6 ఫేస్ లోని అపార్ట్మెంట్లో నిర్వహిస్తున్న "సర్" ప్రక్రియలో భాగంగా ఓటర్లతో సీఈవో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం Indo Fortune గ్రేటర్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ పరిశీలించి బిఎల్ఓ ల పనితీరును పర్యవేక్షించి అక్కడ ఉన్న ఓటర్లు అడిగిన సందేహాలకు సీఈవో సమాధానం ఇచ్చారు. ఈ పర్యటనలో కూకట్పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, కూకట్పల్లి ఎమ్మార్వో అశోక్ , డిసి ఆంజనేయులు సూపర్వైజర్లు, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు

# తలకొండపల్లి పోలీస్ స్టేషన్ ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి





**తలకొండపల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి పోలీస్ స్టేషన్ ని శుక్రవారం మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణ రెడ్డి తో కలిసి. ఆకస్మికంగా తనిఖీ చేసిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ రేట్. కమిషనర్ తరుణ్ జోషి, స్టేషన్ భవనం మరియు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి . పోలీస్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్లో ఉన్న పెండింగ్ ఫైలను తనిఖీ చేశారు. పెండింగ్లో ఎలాంటి కేసులో పెండింగ్ లో ఉండకూడదని. పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాధితులకు వెంటనే న్యాయం చేసే దిశగా పోలీసులు వ్యవహరించాలని ఆదేశించారు, తలకొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని. మండల పరిధిలో డ్రగ్స్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చెయ్యాలని సూచించారు, పెండింగ్ గ్రేవ్ (యుఐ) కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని. దొంగతనం కేసులను. సమర్థవంతంగా అరికట్టి నేరం చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించి, బాధితులకు న్యాయం చేయాలని సూచించారు, CCTNS లో అన్ని కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చెయ్యాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల్లో అవగాహన కల్పించాలని , అలాగే యువత సైబర్ నేరాల వైపు వెల్లకుండా యువతకు మార్గనిర్దేశం చేసి సరైన అవగాహన కల్పించాలని కోరారు. ఈ-సాక్షి యాప్‌ను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తును నాణ్యతతో నిర్వహించి ప్రజలకు సత్వర, పారదర్శక మరియు నాణ్యమైన పోలీసు సేవలు అందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిశుభ్రత మరియు రికార్డుల నిర్వహణ పై పోలీస్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఏసీపీ ఎస్. జానకి రెడ్డి. తలకొండపల్లి ఎస్‌హెచ్‌ఓ వి. జానకి రాం రెడ్డి పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నా ప్రయాణం ఇంకా ముగియలేదు!

వింబుల్డన్ 2026లో సెర్బియా దిగ్గజం నొవాక్ జకోవిచ్‌కు మళ్లీ నిరాశే ఎదురైంది. ఉత్కంఠభరితంగా సాగుతుందనుకున్న సెమీ ఫైనల్ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ యానిక్ సినర్ సునాయసంగా గెలిచి ఫైనల్‌కు చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌కు ముందు వరకు అజేయంగా నిలిచిన జకోవిచ్.. ఆఖరి మెట్టు బోల్తా పడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఈ క్రమంలో జకోవిచ్ రిటైర్‌మెంట్ వార్తలు నెట్టింట జోరందుకున్నాయి. వచ్చే ఏడాది వింబుల్డన్ టోర్నీ ప్రారంభయ్యే సమ-యానికి అతడికి 40 ఏళ్లు నిండనున్నాయి. అయితే ఆ వార్తలన్నింటికి జకోవిచ్ చెక్ పెట్టాడు. వచ్చే ఏడాది కూడా బరిలోకి దిగుతానని స్పష్టం చేశాడు.'నా ప్రయాణం అప్పుడే అయిపోలేదు. కనీసం మరోసారి అయినా వింబుల్డన్‌లో ఆడతా. మూడు రోజుల క్రితం క్వార్టర్ ఫైనల్లో సాధించిన విజయం పట్ల గర్వంగా ఉంది. ఇప్పటికీ అత్యున్నత స్థాయిలో ఆడగలనని నాకు నేనే నిరూపించుకున్నాను. ప్రపంచ నంబర్ 1 చేతిలో నేరుగా మూడు సెట్లలో ఓడిపోవడం వాస్తవం. దాన్ని అంగీకరించాల్సిందే. అయినప్పటికీ ఈ టోర్నీలో నా పోరాట పటిమ, అంకితభావం సానుకూల అంశాలే. 99 శాతం మంది ఆటగాళ్లకు సెమీఫైనల్ చేరడం గొప్ప ఫలితమే. కానీ నాకు మాత్రం అది సరిపోదు. రెండు దశాబ్దాలకు పైగా అత్యున్నత విజయాలకు అలవాటుపడ్డాను. అందుకే ఎప్పుడూ మరింత పెద్ద లక్ష్యాలే కనిపిస్తుంటాయి. ఆ అంచనాలు, వాస్తవాల మధ్య సమతుల్యత సాధించేందుకు ప్రయత్నిస్తున్నా' అని జకోవిచ్ పేర్కొన్నాడు. 2022 తర్వాత జకోవిచ్ ఒక్క గ్రాండ్ స్లామ్ టైటిల్ కూడా గెలవలేదు. 2023 యూఎస్ ఓపెన్ తర్వాత అతడి ఖాతాలో మరో మేజర్ ట్రోఫీ చేరలేదు. గతేడాది నాలుగు గ్రాండ్ స్లామ్‌ల్లోనూ సెమీ ఫైనల్ దశలోనే నిష్క్రమించిన అతడు.. 2024 వింబుల్డన్ ఫైనల్‌తో పాటు ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో కార్లోస్ అల్కరాజ్ చేతిలో ఓటమి పాలయ్యాడు. దీంతో మహిళల దిగ్గజం మార్గరెట్ కోర్ట్ పేరిట ఉన్న 24 గ్రాండ్ స్లామ్ టైటిళ్ల రికార్డును అధిగమించే అవకాశం మరోసారి వాయిదా పడింది. వింబుల్డన్ ప్రయాణం ముగియడంతో జకోవిచ్ ఇప్పుడు అమెరికా హార్డ్‌కోర్ట్ సీజన్‌పై దృష్టి సారించాడు. నాలుగు సార్లు యూఎస్ ఓపెన్ ఛాంపియన్ అయిన అతడు.. ఈసారి మరోసారి టైటిల్ వేటలో దిగేందుకు సిద్ధమవుతున్నాడు.

# సెమీ ఫైనల్లోకి స్పెయిన్



ఫిఫా ప్రపంచకప్ లో సెమీఫైనల్స్ బెర్త్‌ల రేసు అత్యంత ఉత్కంఠభరితంగా మారింది. శనివారం జరిగిన మరో హై-ప్రొఫైల్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ జట్టు 2-1 గోల్స్ తేడాతో బెల్జియంను చిత్తు చేసి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ విజయంతో మంగళవారం డాలస్‌లో జరగబోయే మొదటి సెమీఫైనల్‌లో ఫ్రాన్స్‌తో తలపడేందుకు స్పెయిన్ సిద్ధమైంది.

### మెరీనో లేట్ మేజిక్.. స్పెయిన్ విక్టరీ

మ్యాచ్ ప్రారంభం నుంచే ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మ్యాచ్ 30వ నిమిషంలో స్పెయిన్ స్టార్ ప్లేయర్ ఫాబియన్ రుయిజ్ అద్భుతమైన ఫీల్డ్ గోల్‌తో తన జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అయితే బెల్జియం కూడా ఏమాత్రం తగ్గకుండా పోరాడింది. 41వ నిమిషంలో ఆ జట్టు ప్లేయర్ చార్లెస్ డి కెటెలార్ మెరుపు గోల్‌తో స్కోరును 1-1తో సమం చేశాడు. దీనితో ఫస్టాఫ్ ముగిసేసరికి ఇరు జట్లు సమానంగా నిలిచాయి. సెకండాఫ్‌లో ఇరు జట్ల డిఫెండర్లు గట్టిగా నిలబడటంతో మ్యాచ్ ఎక్స్‌ట్రా టైమ్‌కు వెళ్తుందని భావించిన తరుణంలో.. 88వ నిమిషంలో స్పెయిన్ మిడ్‌ఫీల్డర్ మికెల్ మెరీనో లీడ్ గోల్ కొట్టి బెల్జియం ఆశలపై నీళ్లు చల్లాడు. చివరి నిమిషాల్లో బెల్జియం ఎంత ప్రయత్నించినా స్పెయిన్ రక్షణ శ్రేణిని ఛేదించలేకపోయింది.

### సెమీఫైనల్స్ డ్రీమ్ మ్యాచ్

క్వార్టర్స్ ముగిసేసరికి లీగ్ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. మొరాకోను 2-0తో ఓడించిన ఫ్రాన్స్ తో.. స్పెయిన్ జట్టు సెమీస్ లో ఢీకొనబోతోంది. ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్‌లో అత్యంత బలమైన ప్రత్యర్థులుగా ఉన్న స్పెయిన్ - ఫ్రాన్స్ జట్లు ఫైనల్ బెర్త్ కోసం తలపడనుండటంతో ఫుట్‌బాల్ ప్రేమికుల్లో ఇప్పుడే ప్రపంచకప్ ఫీవర్ పీక్స్‌కు చేరింది.



# వైభవ్ ఎంట్రీపై పార్థివ్ పటేల్ సంచలన వ్యాఖ్యలు..

ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు ఎంపికపై చర్చ కొనసాగుతున్న వేళ మాజీ వికెట్‌కీపర్ పార్థివ్ పటేల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వడం భావోద్వేగపరంగా సరైన నిర్ణయమే అయినప్పటికీ, ప్రస్తుత ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటే సంజూ శాంసన్‌ను పక్కన పెట్టడాన్ని సమర్థించడం కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో సంజూకు నిలకడలేమి అనే విమర్శలు ఎదురైనా, ఇటీవలి కాలంలో అతను తన ఆటతీరుతో ఆ విమర్శలను అధిగమించాడని పార్థివ్ పేర్కొన్నారు. ఒకే ఆటగాడిని వేర్వేరు ప్రమాణాలతో అంచనా వేయకూడదని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తు దృష్ట్యా యువ ప్రతిభకు అవకాశాలు ఇవ్వడం అవసరమే అయినా, ప్రస్తుత ప్రదర్శనను విస్మరించరాదని సూచించారు. అదే సమయంలో, భారత క్రికెట్‌లో జట్టులో లేని ఆటగాడే అత్యుత్తమ ఎంపికగా కనిపిస్తాడనే అభిమానుల మనస్తత్వాన్ని కూడా పార్థివ్ ప్రస్తావించారు. యువతకు అవకాశాలు కల్పించడం, అనుభవజ్ఞులకు న్యాయం చేయడం మధ్య సమతుల్యతను పాటించడమే సెలెక్టర్ల ముందున్న అసలు సవాలని ఆయన వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. జియోస్టార్‌తో మాట్లాడుతూ పార్థివ్ పటేల్, గత 11-12 ఏళ్లుగా సంజు శాంసన్ కెరీర్‌ను ఒకే ప్రశ్న వెంటాడుతోందని అన్నారు.. అదే అతని నిలకడ. ఈ కారణంగా అతన్ని జట్టు నుండి చాలాసార్లు తొలగించారు, కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉందని అభిప్రాయపడ్డారు. సంజు శాంసన్‌ను ఎందుకు ఎప్పుడూ పక్కన పెడుతున్నారు? గతంలో అతను నిలకడగా పరుగులు చేయడం లేదని లేదా వేగంగా బ్యాటింగ్ చేయడం లేదని అనేవారు. కానీ ఒకే ఆటగాడిని వేర్వేరు కొలమానాల ఆధారంగా అంచనా వేయలేం అన్నారు పార్థివ్.. వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వడం భావోద్వేగపరంగా సరైన నిర్ణయ-ఎమేనని, ఎందుకంటే అతను భారత క్రికెట్‌లో చాలా ప్రతిభావంతుడైన యువ తార అని పార్థివ్ ఇంకా పేర్కొన్నాడు. అయితే, ఎంపిక కేవలం ప్రదర్శన మరియు తర్కం ఆధారంగానే జరిగితే, సంజు శాంసన్‌ను పక్కన పెట్టడానికి బలమైన కారణం ఏదీ ఉండదు అన్నారు..కాగా, టీ20 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన సంజు శాంసన్ వరుసగా మూడు ఇన్నింగ్స్‌లలో పెద్ద స్కోరు చేయడంలో విఫలమవడంతో, 15 ఏళ్ల వైభవ్ సూర్య వంశీని భారత టీ20 జట్టులోకి తీసుకున్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సెలెక్టర్లు ఈ యువ బ్యాట్స్‌మన్‌పై విశ్వాసం వ్యక్తం చేసినప్పటికీ, వైభవ్ ఇప్పటివరకు చెప్పుకోదగ్గ ప్రభావాన్ని చూపడంలో విఫలమయ్యాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20ఐ సిరీస్‌లో భారత్ ప్రస్తుతం 0-3తో వెనుకబడి ఉంది. ఈ సిరీస్‌లోని ఐదవ, చివరి మ్యాచ్ ఈ రోజు జరగనున్న విషయం విదితమే..







# భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త ఊపు..

భారత ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా దేశ విదేశీ మారక నిల్వలు మరోసారి భారీగా పెరిగాయి. జూలై 3 తో ముగిసిన వారానికి గాను దేశ ఫారెక్స్ నిల్వలు ఏకంగా 7.26 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 60,600 కోట్లు) పెరిగి, మొత్తంగా 674.19 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరుకున్నాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న సానుకూల పరిణామాలు, దేశీయ మార్కెట్లలోకి విదేశీ పెట్టుబడులు భారీగా తరలిరావడమే ఈ వృద్ధికి ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### ఆర్బీఐ నివేదికలోని ముఖ్యాంశాలు..

రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఫారెక్స్ నిల్వల్లో అత్యంత కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు ఈ వారంలో 6.13 బిలియన్ డాలర్లు పెరిగి 591.56 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అదే విధంగా దేశంలోని బంగారు నిల్వల విలువ కూడా 1.05 బిలియన్ డాలర్లు వృద్ధి చెంది 60.15 బిలియన్ డాలర్ల మార్కును తాకింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి వద్ద ఉన్న ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు కూడా స్వల్పంగా పెరిగాయి. ఈ భారీ నిల్వల వల్ల అంతర్జాతీయంగా రూపాయి విలువ స్థిరంగా ఉండటం తో పాటు, ఎలాంటి ప్రపంచ ఆర్థిక సంక్షోభాలనైనా తట్టుకునే పటిష్టమైన స్థితికి భారతదేశం చేరుకుందని ఆర్బీఐ వర్గాలు తెలిపాయి.

# ఓపెన్ ఏఐపై యాపిల్ దావా..



కృత్రిమ మేధ రంగంలో పోటీ రోజు-రోజుకూ తీవ్రతరమవుతున్న వేళ ప్రపంచ దిగ్గజ సంస్థ యాపిల్, ఏఐ స్టార్టప్ ఓపెన్ ఏఐ మధ్య వివాదం నెలకొంది. ఓపెన్ ఏఐ సంస్థ తమ వాణిజ్య రహస్యాలను దొంగిలించిందని యాపిల్ ఆరోపించింది. ఓపెన్‌ఏఐతో పాటు తమ సంస్థలో గతంలో పనిచేసిన ఇద్దరు మాజీ ఉద్యోగులపై యాపిల్ కేసు దాఖలు చేసింది. అమెరికాలోని కాలిఫోర్నియా ఉత్తర జిల్లా న్యాయస్థానంలో దాఖలైన పిటిషన్‌లో యాపిల్ పలు కీలక ఆరోపణలు చేసింది. తమ సంస్థకు చెందిన అత్యంత రహస్య సాంకేతిక సమాచారం, ఉత్పత్తుల నమూనాలు, తయారీ ప్రక్రియలు, సరఫరా వ్యవస్థకు సంబంధించిన కీలక వివరాలను అక్రమంగా సేకరించి ఓపెన్‌ఏఐ హార్డ్‌వేర్ ప్రాజెక్టులకు ఉపయోగించారని యాపిల్ ఆరోపించింది. ఆ మాజీ ఉద్యోగులు యాపిల్‌లో పనిచేస్తున్న సమయంలోనే కీలక రహస్య పత్రాలు, ఉత్పత్తుల రూపకల్పన వివరాలు, తయారీ విధానాలు, సరఫరా గొలుసుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఓపెన్ ఏఐకు చేరవేశారని పేర్కొంది. ఈ చర్యలు ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగాయని యాపిల్ వాదిస్తోంది. ఆ ఇద్దరు మాజీ ఉద్యోగుల్లో ఒకరు ప్రస్తుతం ఓపెన్ ఏఐ హార్డ్‌వేర్ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు పిటిషన్‌లో పేర్కొంది. యాపిల్ ఆరోపణలను ఓపెన్ ఏఐ ఖండించింది. ప్రత్యర్థి సంస్థల వ్యాపార రహస్యాలపై తమకు ఆసక్తి లేదని, స్వతంత్ర పరిశోధనల ఆధారంగానే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపింది. కోర్టులో తమ వాదనలు వినిపిస్తామని వెల్లడించింది.

# గ్యాస్ సిలిండర్ ధరలు స్థిరం



దేశవ్యాప్తంగా గృహ వినియోగ (14.2 కిలోలు) ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరల్లో ఇవాళ (జూలై 11) ఎలాంటి మార్పు లేదు. చమురు మార్కెటింగ్ సంస్థలు గతంలో ప్రకటించిన ధరలే కొనసాగుతున్నాయి. దీంతో వినియోగదారులకు ఎలాంటి ధరల మార్పు లేకుండానే సిలిండర్లు అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాల్లో 14.2 కిలోల గృహ వినియోగ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ తాజా ధరలు ఇవే..

### తెలంగాణ..

హైదరాబాద్ -- రూ. 994.00
వరంగల్ -- రూ. 984.00

### ఆంధ్రప్రదేశ్..

విజయవాడ -- రూ. 966.50
గుంటూరు -- రూ. 966.50
విశాఖపట్నం -- రూ. 921.00

దేశంలోని ఇతర నగరాల్లో కూడా గృహ వినియోగ ఎల్‌పీజీ ధరలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఇక వాణిజ్య (19 కిలోలు) ఎల్‌పీజీ సిలిండర్ ధరలు మాత్రం జూలై 1న తగ్గిన తర్వాత అదే ధరలు అమల్లో ఉన్నాయి.



# వంట నూనెల ధరలు సలసల

పండగల సీజన్‌కు ముందే దేశంలో వంట నూనెల సెగ ప్రారంభమైంది. ప్రధాన వంట నూనెల ధర గత ఏడాది కాలంలో సగటున 12.8 శాతం పెరిగాయి. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ (డీసీఏ) నివేదిక ప్రకారం ఈ నెల మూడవ తేదీ నాటికి రిటైల్ మార్కెట్లో, కిలో ఆవనూనె రూ. 193.54, సోయా ఆయిల్ రూ. 163.10, పామాయిల్ రూ. 147.37కు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ మూడు వంట నూనెల ధర సగటున 10.74 శాతం నుంచి 12.87 శాతం వరకు పెరిగాయి. మూడు నెలల క్రితం ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్ లో ఐదు లీటర్ల సన్‌ఫ్లవర్ ఆయిల్ క్యాన్ రూ. 850 నుంచి రూ. 870 మధ్య ఉండేది. ఇప్పుడది బ్రాండ్‌ను బట్టి రూ. 970 నుంచి రూ. 1,395 వరకు పలుకుతోంది.

### యుద్ధం దెబ్బ

పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వంట నూనెల ధరలపైనా పడింది. ఈ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా నౌకా రవాణ, బీమా ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం రేటు ఒక దశలో రూ. 97 వరకు పడిపోయింది. దీనికి తోడు ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలు తమ దేశంలో ఉత్పత్తి చేసే పామాయిల్‌లో కొంత భాగాన్ని బయో ఫ్యూయల్స్‌కు మళ్లిస్తున్నాయి. ఇండోనేషియా అయితే ఈ నెల 1 నుంచి తమ దేశంలో విక్రయించే పెట్రోల్, డీజిల్‌లో సగం పామాయిల్ కలపాలని నిర్ణయించింది. మన దేశంలో వంట నూనెల ధర పెరిగేందుకు ఇవన్నీ ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామాలతో ఈ నెల 3వ తేదీ నాటికి.. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ముంబై రేవుకు దిగువ-ఎతయ్యే పామాయిల్ ధర 11 శాతం, సోయా ఆయిల్ ధర 6 శాతం, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర 20 శాతం పెరిగిన విషయాన్ని పరిశ్రమ వర్గాలు గుర్తు చేస్తున్నాయి.

### అంతర్జాతీయ ఆటుపోట్లు

భారత్ ప్రస్తుతం తన వంట నూనెల అవసరాల్లో 57 నుంచి 58 శాతం దిగుమతి చేసుకుంటోంది. గత ఏడాది అక్టోబరుతో ముగిసిన 2024-25 ఆయిల్ ఇయర్‌లో మన దేశం 1,830 కోట్ల డాలర్ల (సుమారు రూ. 1.74 లక్షల కోట్లు) విలువైన 160.1 లక్షల టన్నుల వంట నూనెలు దిగుమతి చేసుకుంది. గత ఏడాది నవంబరులో ప్రారంభమైన 2025-26 ఆయిల్ ఇయర్‌లో ఈ దిగుమతులు 168 లక్షల టన్నులకు చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

### మరింత పెరిగే చాన్స్!

ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నిటినీ ఎల్‌నినో భయం వెంటాడుతోంది. ఈ ప్రభావంతో మన దేశంలోనూ వర్షాభావం కనిపిస్తోంది. దీంతో వేరు శనగ, సోయా ఎక్కువగా సాగు చేసే గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఖరీఫ్ నూనె గింజల ఖరీఫ్ సాగు ఇప్పటికే 30 శాతం పడిపోయినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పండగల సీజన్ నాటికి దేశంలో వంట నూనెల సెగ మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




# కల్తీ వల్లే యువతలో క్యాన్సర్..

ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్‌లో జోరుమీదున్న స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్.. త్వరలో 'ది ఇండియా స్టోరీ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది. చేతన్ డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం పురుగుమందుల ఆధారిత వ్యవసాయం వెనుక దాగి ఉన్న భయంకరమైన నిజాలను వెలికితీసే ప్రయత్నంగా తెరకెక్కుతోంది. రోజువారీ ఆహారంలోకి చేరుతున్న విషపూరిత రసాయనాలు, ముఖ్యంగా యువత ఆరోగ్యంపై పడుతున్న ప్రభావం ప్రధాన అంశాలుగా రాబోతున్న ఈ చిత్రం జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేట్రర్స్‌లోకి రానుంది. ఈ సందర్భంగా తాజాగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న కాజల్ ఆహారం కల్తిపై షాకింగ్ కామెంట్స్ చేసింది. 'ఆహార కల్తీ వల్లే యువతలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా పెరుగుతున్నాయి. ఈ మేరకు కల్తీపై అవగాహన కల్పించే భాగంగానే మా 'ది ఇండియా స్టోరీ' రాబోతుంది. అయితే.. ఈ ప్రాజెక్ట్ రీసెర్చ్‌లో నేను చాలా షాకింగ్ విషయాలు తెలుసుకున్నా. అంతే కాదు ఇటీవల ఓ కేసు గురించి విని పుచ్చకాయ తినడం మానేశా' అని చెప్పుకొచ్చింది.







# అర్జున్ దాస్ ఫస్ట్ లుక్ రిలీజ్

అర్జున్ దాస్, శాండీ మాస్టర్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సూపర్ హీరో బాబు'. తాజాగా ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను షేర్ చేశారు మేకర్స్. సూపర్ హీరో లుక్‌లో అర్జున్ దాస్ కనిపిస్తుండగా.. అతని చుట్టూ ఆశ్చర్యకరంగా మిగిలిన వారు నిలబడి ఉండగా ఈ ఇంటెన్స్ లుక్ అందరిని ఆకట్టుకుంటోంది. కాగా.. ఈ మూవీని జాతీయ అవార్డు గ్రహీత నిర్మాత కె.ఎస్. సినిష్ 'సోల్జర్స్ ఫిల్మ్ ఫ్యాక్టరీ' బ్యానర్‌పై సమర్పిస్తుండగా 'రెడాక్టెడ్ స్టూడియోస్'కు చెందిన శంజన్ జి సంయుక్తంగా నిర్మించారు. తెలుగు-తమిళ ద్విభాషా చిత్రంగా రాబోతున్న ఈ మూవీలో హీరోయిన్ తేజు అశ్విని, అర్జున్ దాస్ సీన్స్ హైలెట్ కానున్నాయి. ఈ చిత్రంతో విఘ్నేష్ వేణుగోపాల్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'ఖుషి', 'హాయ్ నాన్న', 'ది గర్ల్‌ఫ్రెండ్' వంటి భావోద్వేగభరితమైన చిత్రాలకు సంగీతం అందించిన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ మూవీకి సంగీతం అందిస్తుండగా.. మూవీపై ఎక్స్‌పెక్టేషన్స్ పెరిగాయి.




# భాగ్యశ్రీ బోర్సే అందాల మెరుపు

ఇప్పటికే ఈ మూవీపై మంచి అంచనాలు నెలకొనగా, ఈ సినిమాతో భాగ్యశ్రీకు బ్రేక్ దక్కుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ చిత్రం ఆమె కెరీర్‌కు ఎలాంటి బూస్ట్ ఇస్తుందో చూడాలి. ఇక సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ భాగ్యశ్రీ బోర్సే యాక్టివ్‌గా ఉంటూ తరచూ తన లేటెస్ట్ ఫొటోషూట్‌లతో అభిమానులను ఆకట్టుకుంటోంది.మోడ్రన్ లుక్‌తో పాటు అప్పుడప్పుడు ట్రెడిషనల్ అవతార్‌లోనూ మెరిసి నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ లంగా-వోణీలో దర్శనమిచ్చింది. రెండు చేతుల నిండా గాజులు, మెడలో సొగసైన హారం, పెద్ద ఇయర్‌రింగ్స్ ధరించి, కురులను అందంగా వెనక్కి వదులుతూ కెమెరాకు స్టైలిష్‌గా పోజులిచ్చింది.సంప్రదాయ హుందాతనం, సహజమైన అందం కలగలిసిన ఈ లుక్‌లో భాగ్యశ్రీ బోర్సే మరింత ఆకర్షణీయంగా కనిపించడంతో ఆమె తాజా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# దాదాపు కన్ఫర్మ్ అయినట్టే?

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా, మొదటిసారి దర్శకత్వం వహించబోతున్న చిత్రం పై అనౌన్స్మెంట్ నుంచే మంచి హైప్ ఏర్పడింది. రామ్ కెరీర్లో 23 చిత్రంగా రాబోతున్న ఈ ప్రాజక్ట్‌ను మైండ్ బ్లోయింగ్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందించాలని రామ్ ప్లాన్ చేస్తున్నాడు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా పాన్-ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ సామ్ సీఎస్ సంగీతాన్ని అందిస్తున్నారు.అయితే ఈ సినిమా హీరోయిన్ విషయంలో మాత్రం క్లారిటీ రావడం లేదు. మొదట్లో ఫలానా బ్యూటీ ఫైనల్ అయిందనే వార్తలు రాగా.. బడ్జెట్ కారణంగా ఓ కొలిక్కి రావడం లేదు. అయితే, లేటెస్ట్‌గా ఈ సినిమాలో రామ్ సరసన కథానాయికగా టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్తా మీనన్ పేరు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి చర్చలు తుది దశలో ఉన్నాయని వినికిడి. కథ మరియు పాత్ర నచ్చడంతో సంయుక్తా మీనన్ కూడా ఈ ప్రాజెక్ట్‌కు ఓకె చెప్పినట్టుగా టాక్ నడుస్తోంది. త్వరలోనే చిత్ర బృందం నుండి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇప్పటికే టాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ హిట్లతో దూసుకుపోతోంది సంయుక్తా మీనన్. స్లమ్ డాగ్, స్వయంభూ వంటి భారీ చిత్రాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ మూవీ 'బ్లాక్ గోల్డ్' వంటి విభిన్నమైన ప్రాజెక్ట్‌తో దూసుకుపోతోంది. ఇక ఇప్పుడు ఈ అమ్మడు ఖాతాలోకి మరో బంపర్ ఆఫర్ వచ్చి చేరినట్లే. మరి రామ్ పోతినేని, సంయుక్త మీనన్ జోడీ ఎలా ఉంటుందో చూడాలి.

# హిలేరియస్‌గా 'ఓ..! సుకుమారి'




టీజర్, ఫస్ట్ సింగిల్‌తో అంచనాలను పెంచిన 'ఓ..! సుకుమారి' ఇప్పుడు గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. తిరు వీర్, ఐశ్వర్య రాజేష్ జంటగా నటిస్తున్న ఈ రొమాన్స్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌కు భరత్ దర్శన్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. 'శివం భాజే' విజయం తర్వాత గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన అప్డేట్స్ ఆకట్టుకోగా.. తాజాగా హిట్ మెషిన్ అనిల్ రావిపూడి ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. 'దామిని గురించి ఊరంతా భయపడుతూ ఉంటుంది. కారణం ఏమిటంటే... ఆమెను ఎవరైనా తాకితే వారికి కరెంట్ షాక్ తగులుతుంది. ఈ విచిత్రమైన రహస్యాన్ని దాచిపెట్టి ఆమెకు హీరోతో పెళ్లి చేస్తారు. పెళ్లి తర్వాత అసలు విషయం తెలిసిన హీరో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడు? ఈ సమస్యను భార్యాభర్తలు కలిసి ఎలా ఎదుర్కొన్నారు? చివరకు వారి జీవితంలో ప్రేమ, ఆనందం ఎలా చోటుచేసుకున్నాయి? అన్నదే సినిమా ప్రధాన కథాంశం. 'ఓ..! సుకుమారి' ట్రైలర్ కామెడీ, ప్రేమ, భావోద్వేగాలను కలిపిన వినోదాత్మక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సినిమాపై అంచనాలను పెంచగా.. భారీ అంచనాల మధ్య జులై 17న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**